


మా కలం - సామాన్యుడి బలం

# స్వర్ణసాగరం

PRGI: APTEL/26/A2367

జాతీయ తెలుగు దినపత్రిక

www.swarnasagaram.com

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 1 | సంచిక : 170 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | ఆదివారం 30 ఆగస్టు 2026 | వెల : 2-00



## ప్రజారోగ్య రంగంలో విప్లవం..

# సంజీవని



- మారుమూల ప్రాంతాల్లోనూ ప్రజల చెంతకే వైద్యం
- రూ.250 కోట్లతో గిరిజన ఆరోగ్య మిషన్
- ఆదివాసీల అభివృద్ధికి ఐదు సూత్రాలు అమలు
- గత పాలనలో బలవంతపు మత మార్పిడులు
- జే బ్రాండ్ల మద్యంతో ఆరోగ్యం నాశనం చేశారు
- గ్రూప్-1 అభ్యర్థుల జీవితాలతో ఆడుకున్నారు
- ఏకగ్రీవాలపై అధికారంలో ఒక మాట... ఇప్పుడొక మాట
- 31న వెలిగొండకు కృష్ణాజలాలు... సెప్టెంబర్ 2న అనకాపల్లికి గోదావరి జలాలు
- సంజీవని కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

స్వర్ణసాగరం అరకు, మహానగర్

మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చి, వైద్యం కోసం కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన అవసరం లేకుండా వారి చెంతకే ఆరోగ్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ సంకల్పమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా వ్యక్తిగత డిజిటల్ హెల్త్ రికార్డులను రూపొందిస్తూ చేపట్టిన సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని సంరక్షిస్తామని తెలిపారు. ఈ ప్రాజెక్టును త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అరకు లోయ నియోజకవర్గం గన్నెలిలో సంజీవని ప్రాజెక్టు అమలు తీరును శనివారం పరిశీలించిన సీఎం, అనంతరం ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో ప్రతి కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపడటమే నిజమైన అభివృద్ధి అని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో మెరుగైన వైద్య సదుపాయాల కోసం రూ.250 కోట్లతో ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంప్లీషన్ మిషన్‌ను తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. సికిల్‌సెల్, తలసేమియా బాధితులకు నెలకు రూ.10 వేల పెన్షన్ అందిస్తున్నామని, త్వరలో రాష్ట్రంలోని అన్ని మండలాల్లో తక్కువ ధరకే మందులు అందించే జన ఔషధి కేంద్రాలు ప్రారంభిస్తామని చెప్పారు. అల్లూరి జిల్లాలో సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని, గతంలోనే అల్లూరి సీతారామరాజు గిరిజనులకు ఆయుర్వేద వైద్యం అందించారని గుర్తుచేశారు. అలాంటి మహనీయుడిని నిత్యం స్మరించుకునేందుకు కొత్తగా నిర్మించిన విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టామని తెలిపారు. థింసా నృత్యంతో గిరిజన బిడ్డలు గిన్నీస్ వరల్డ్ రికార్డు సృష్టించడం అభినందనీయమన్నారు. యోగా, ధ్యానం వంటి - మిగతా 3లో



# మహా విధ్వంసం

- ప్రళయం మిగిల్చిన విషాదం
- సర్వం కోల్పోయి, గల్లంతైన ఆప్తుల కోసం అన్వేషిస్తున్న నేపాల్‌లోని కుటుంబాలు
- నేపాల్ ఆకస్మిక వరదలు
- 600 దాటిన మృతుల సంఖ్య
- శవాల ఫొటోల వద్ద కుటుంబాల రోదనలు
- మరోవైపు ఆసుపత్రుల వెలుపల, చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వివరాలను చూసేందుకు కుటుంబాలు బారులు తీరుతున్నాయి



## హిమాలయాల్లో 'మంచు' ముప్పు

- భారత్‌లో 195 హైరిస్క్ సరస్సులు
- బద్దలైతే జలప్రళయమే!
- హిమాలయాల్లో 7,500 హిమానీనద సరస్సులు
- భారత్‌లో 195 సరస్సులు అత్యంత ప్రమాదకరంగా గుర్తింపు
- సిక్కింలోనే 25 హైరిస్క్ సరస్సులు
- గంగా పరివాహక ప్రాంతంలో 4,700 సరస్సులు

2

## ఖర్గే సభా వేదికను శుద్ధి చేయడం నేరమే



- వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి: రాహుల్ డిమాండ్
- ఖర్గే సభా వేదికను శుద్ధి చేయడంపై రాహుల్ ఆగ్రహం
- బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు పెట్టాలని డిమాండ్
- బీజేపీ, ఆర్ఎస్ఎస్ వైఖరి అంటరానితనానికి మరో రూపం

2

## ఎల్‌ఓసీ వద్ద పాక్ డ్రోన్ కలకలం



- సరిహద్దు వెంబడి బలగాల ముమ్మర గాలింపు
- మెంధర్ సెక్టార్‌లోని బాలాకోట్ ప్రాంతంలో డ్రోన్ గుర్తింపు
- సరిహద్దు దాటి పాక్ వైపు వెళ్లినట్లు అధికారుల వెల్లడి
- అనుమానాస్పద కదలికలపై ఉధంపూర్, కతువా, రాజౌరిలోనూ సెర్చ్ ఆపరేషన్లు

## గ్రూప్-1కు మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ



- ఎంపిక కోసం రాష్ట్రస్థాయి ప్రవేశ పరీక్ష
- ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ 10 వరకు దరఖాస్తులకు అవకాశం
- మైనారిటీ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

వివరాలు 3లో..

## ఏకగ్రీవాలపై అధికారంలో ఒక మాట...

# ఇప్పుడొక మాట

- ఏకగ్రీవాలపై గత ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని సీఎం చంద్రబాబు విమర్శ
- గత పాలనలో జే బ్రాండ్లు, బలవంతపు మత మార్పిడులతో రాష్ట్రాన్ని నాశనం చేశారని ఆరోపణ
- సెప్టెంబర్ 2న అనకాపల్లికి గోదావరి జలాలు, 31న వెలిగొండకు కృష్ణా జలాలు విడుదల



అమరావతి, మహానగర్

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాల విషయంలో గత పాలకులు ఇప్పుడు ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలను ప్రోత్సహించి, ఇప్పుడు వాటిని వ్యతిరేకించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అరకు నియోజకవర్గంలోని గన్నెలలో శనివారం జరిగిన 'సంజీవని' ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. "అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారం కోల్పోయాక మరో మాట మాట్లాడటం వారి నైజానికి నిదర్శనం" అని చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడైనా ఏకగ్రీవం అయితే, సదరు నియోజకవర్గ ఇన్చార్జిదే బాధ్యత... వచ్చే ఎన్నికల్లో వారికి టికెట్ ఉండదు అని జగన్ వైసీపీ నేతలను హెచ్చరించిన నేపథ్యంలో చంద్రబాబు వ్యాఖ్యలు ప్రాధాన్యత - మిగతా 3లో

## ఎంబీబీఎస్, బీడీఎస్ ఫీజులు 10 శాతం పెంపు

- వైద్య విద్య కోర్సులకు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలో వసూలు చేయాల్సిన ఫీజులను ప్రకటించిన ప్రభుత్వం
- సూపర్ స్పెషాలిటీ కోర్సులకు 15 శాతం ఫీజు పెంపుదల చేస్తున్నట్టు ఉత్తర్వులు
- వైద్యవిద్య కోర్సుల ఫీజులు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం

3



స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక
RNI No : APTEL/2020/13906



# మహా విధ్వంసం

ఆసుపత్రుల వెలుపల గోడలకు అంటించిన మృతుల ఫొటోలను చూస్తూ కన్నీరుమున్నీరు అవుతున్న జనాలు. తమ సామగ్రి కోసం బురదలో, శిథిలాల మధ్య వెతుకుతున్న కుటుంబాలు. దెబ్బతిన్న భవనాల గుండా పసిబిడ్డను ఎత్తుకొని వెళ్తున్న ఓ బాధిత మహిళ. శిథిలాల మధ్య పడి ఉన్న ఓ కుక్క కళేబరం. నేపాల్?ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు సృష్టించిన బీభత్సానికి ఇవి కొన్ని సజీవ సాక్ష్యాలు. మరోవైపు రోజులు గడుస్తున్న కొద్దీ గల్లంతైన వారి బంధువుల్లో ఆశలు ఆవిరి అవుతున్నాయి. మరోవైపు సహాయక బృందాలు అత్యంత ప్రతికూల వాతావరణంలోనూ ప్రాణాలకు తెగించి బాధితుల కోసం గాలిస్తున్నాయి. బుధవారం నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు ఒక్కసారిగా గ్రామాలు, పట్టణాలను ఊడ్చేసింది. వరద ఉద్ధృతికి ఇళ్లు, వాహనాలు, రోడ్లు, వంతెనలు అన్నీ కొట్టుకుపోయాయి. జలవిద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ పెను విపత్తు నుంచి కోలుకోవడానికి ఇప్పుడు నేపాల్ తీవ్రంగా శ్రమిస్తోంది.



**భారీగా పెరిగిన మృతుల సంఖ్య**

శనివారం నాటికి నేపాల్‌లో మృతుల సంఖ్య 600 దాటగా, మరో 2400 మంది గల్లంతయ్యారు. పైగా వరద ప్రభావిత ప్రాంతాల్లో తరచూ వర్షాలు పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ రెస్క్యూ బృందాలు ఎంతో శ్రమించి 163 మంది విదేశీయులతోపాటు, దాదాపు 2500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరోవైపు ఆసుపత్రుల వెలుపల, చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వివరాలను చూసేందుకు కుటుంబాలు బారులు తీరుతున్నాయి. తమకు తెలిసిన వారు ఎవరైనా ఉన్నారేమోననే ఆశతో పేర్లు, ఫొటోలను ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారు. బతికున్న వారి జాబితాలో తమ వారి పేర్లు కనిపించకపోవడంతో, భారమైన హృదయంతో, మరణించిన వారి ఫొటోలు ఉన్న మరో జాబితా వైపు వెళ్తున్నారు. ఈ హృదయవిదారకమైన దృశ్యాలు చూపరులను కన్నీటి పర్యంతం చేస్తున్నాయి. కాగా, వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ సిబ్బంది రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా శ్రమిస్తున్నారు. వర్షాలను సైతం లెక్కచేయకుండా, బురదను తవ్వుకుంటూ గల్లంతైన వారి కోసం అన్వేషిస్తున్నారు.

అప్పర్ త్రిశూలి 3ఏ జలవిద్యుత్ ప్రాజెక్ట్ వద్ద వందలాది మంది కార్మికులు సొరంగంలో చిక్కుకుపోయారు. అక్కడ టన్నుల కొద్దీ బురద పేరుకుపోయింది. నేపాల్ హోంమంత్రి సుదన్ గురుంగ్ స్వయంగా ప్రొక్లెన్లతో ఆ బురద తొలగింపు పనులను పర్యవేక్షించారు. ఆ టన్నెల్‌లో చిక్కుకుపోయిన 350 మందిని నేపాల్ ఆర్మీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చినట్లు ఆన్?లైన్ ఖబర్? అనే న్యూస్ పోర్టల్ పేర్కొంది.

మధ్య నేపాల్‌లోని గ్రామాల్లో విధ్వంసం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. భవనాలు కొన్ని అడుగుల మేర బురదలో మునిగిపోయాయి. వాహనాలు సగం వరకు బురదలో కూరుకుపోయాయి. రోడ్లు, ఇతర మౌలిక వసతులు వరద ఉద్ధృతికి కొట్టుకుపోయాయి. ఇక ప్రాణాలతో బయటపడిన వారికి, ఉండడానికి ఓ చోటు, వైద్యం, పోయిన సామగ్రి వెతుక్కోవడం కష్టమైపోతోంది. నువాకోట్ జిల్లాలోని దేవిఘాట్ గ్రామంలో ప్రజలు మోకాళ్ల లోతు బురదలో, శిథిలాల గుండా నడుస్తూ తమ వస్తువుల కోసం వెతుకుతున్నారు. ఒక వ్యక్తి శిథిలాల గుండా గ్యాస్ సిలిండర్? మోసుకెళ్తున్నాడు. ఎందుకంటే అతను ఆ ముంపు నుంచి కాపాడుకోగలిగిన ఏకైక వస్తువు అది ఒక్కటే. ఎక్కడ చూసినా దెబ్బతిన్న ఇళ్లు, విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, పాడైపోయిన వాహనాలు కనిపిస్తున్నాయి. ఇది వరద సృష్టించిన మహా విధ్వంసాన్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. ప్రస్తుతం త్రిశూలిలో ఏర్పాటు చేసిన ఆర్మీ రిలీఫ్ క్యాంప్ బాధితులకు కాస్త ఆసరాగా మారింది. ఆర్మీ సిబ్బంది పిల్లలకు, వృద్ధులకు సాయం చేస్తున్నారు. వైద్యులు తాత్కాలిక వైద్య శిబిరాల్లో క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నారు. ఈ క్యాంప్?ల్లోనే గల్లంతైన, మరణించిన, రక్షించబడిన వారి వివరాలను అందిస్తున్నారు. సహాయక చర్యల కోసం 5000 మందికిపైగా నేపాల్ ఆర్మీ సిబ్బందితో కలిపి మొత్తం 11వేల మందికిపైగా భద్రతా సిబ్బంది రంగంలోకి దిగారు.

**మళ్లీ వర్షాలు కురిసే అవకాశం!**

వాతావరణ శాఖ రానున్న రోజుల్లో సాధారణ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాయి. ఇది రెస్క్యూ సిబ్బంది పనిని మరింత కష్టతరం చేసే అవకాశం ఉంది. అయినప్పటికీ, గతంలో ఇలాంటి విపత్తులను ఎదుర్కొన్న అనుభవంతో, గల్లంతైనవారిని వెతకడం, బాధితులకు సహాయం చేయడం, పునర్నిర్మాణ ప్రక్రియను ప్రారంభించడంపై నేపాల్ దృష్టి సారించింది.

# హిమాలయాల్లో 'మంచు' ముప్పు



నేపాల్‌లో ఇటీవల సంభవించిన హిమానీనద విపత్తు భారత్‌కు మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. హిమాలయ పర్వతాల్లోని మంచు సరస్సులు బద్దలైతే ఎంతటి విధ్వంసం సంభవిస్తుందో నేపాల్ ఘటన స్పష్టం చేస్తోంది. అదే సమయంలో భారత్‌లో కూడా వందల సంఖ్యలో ప్రమాదకర హిమానీనద సరస్సులు ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. దీంతో వాటిపై నిరంతర నిఘా, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు ఎంతవరకు సిద్ధంగా ఉన్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ సర్వే ప్రకారం, భారత హిమాలయ ప్రాంతంలో దాదాపు 7,500 హిమానీనద సరస్సులు ఉన్నాయి. వీటిలో సుమారు 10 శాతం కంటే దాదాపు 750 సరస్సులు సిక్కింలోనే ఉన్నట్లు అంచనా. వీటిలో 25 సరస్సులను అత్యంత ప్రమాదకరమైనవిగా గుర్తించారు. హిమాలయ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరగడం, మంచు కరుగుదల, వర్షపాతంలో మార్పులు వంటి పరిణామాలు ఆ సరస్సులపై ప్రభావం చూపుతున్నాయి.

**దిగువ ప్రాంతాల్లో విధ్వంసం!**

హిమానీనదాల నుంచి కరిగిన మంచు, నీరు చేరి ఏర్పడే సరస్సులు కాలక్రమంగా భారీగా విస్తరించే అవకాశం ఉంటుంది. సరస్సులను చుట్టుముట్టిన మంచు, రాళ్ల గోడలు బలహీనపడితే ఒక్కసారిగా నీరు బయటకు రావచ్చు. దీనినే గ్లేషియల్ లేక్ ఔట్?బర్స్ట్?ఫ్లడ్(+శ్రీూఖీ) అంటారు. ఇలాంటి వరదలకు భారీ నీటితోపాటు మట్టి, రాళ్లు, మంచు కూడా కలవడంతో దిగువ ప్రాంతాల్లో విధ్వంసం మరింత పెరుగుతుంది. అయితే భారత్?లో హిమానీనద సరస్సుల ముప్పు సిక్కింకే పరిమితం కాదు. గంగా నదీ పరివాహక ప్రాంతంలోనే సుమారు 4700 సరస్సులు ఉన్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి. ఆ నదీ పరివాహక ప్రాంతం 2.5 లక్షల చదరపు కిలోమీటర్లకుపైగా విస్తరించి ఉంది. వీటిలో ఏదైనా అత్యంత ప్రమాదకర సరస్సు ఒక్కసారిగా బద్దలైతే దిగువ ప్రాంతాల్లోని గ్రామాలు, పట్టణాలు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర కీలక మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ముఖ్యంగా పర్వత ప్రాంతాల్లో లోయలు ఇరుకుగా ఉండటంతో వరద ప్రవాహం మరింత వేగంగా కిందకి దూసుకెళ్లే ప్రమాదం ఉంటుంది.

**సౌత్ లొనాక్ విపత్తు మర్చిపోలేం**

భారత్ ఇప్పటికే ప్రమాదాన్ని చవిచూసింది. 2023 అక్టోబర్ 3వ తేదీన సిక్కింలోని సౌత్ లొనాక్ సరస్సులు వద్ద భారీ విపత్తు సంభవించింది. సరస్సులోకి భారీగా మంచు, రాళ్లు విరిగిపడటంతో ఒక్కసారిగా పెద్ద అల ఏర్పడింది. సుమారు 20 మీటర్ల ఎత్తున ఎగిసిన ఆ నీటి అల దిగువ ప్రాంతాల వైపు దూసుకెళ్లింది. ఆ వరద ప్రవాహానికి జల విద్యుత్ ప్రాజెక్టులు, వంతెనలు, రహదారులు, నివాస ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆ ఘటన హిమానీనద సరస్సుల ప్రమాద తీవ్రతను దేశం ముందు స్పష్టంగా ఉంచింది.

నేపాల్‌లో జరిగిన తాజా విపత్తు మరో కోణాన్ని బయటపెట్టింది. మంచు లేదా రాళ్లు విరిగిపడటం, ఆ తర్వాత భారీగా మట్టి, రాళ్ల ప్రవాహం ఏర్పడటం, తాత్కాలికంగా సరస్సు ఏర్పడటం, చివరకు ఆకస్మిక వరదగా మారడం, ఇలా ఒకదాని తర్వాత ఒకటి వరుసగా జరిగే ప్రమాదాలను క్యాస్కేడింగ్ హజార్డ్స్ అంటారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సభ్యుడు కృష్ణ వత్స ప్రకారం, ఇలాంటి పరిణామాలు చాలా వేగంగా చోటుచేసుకోవచ్చు. దిగువ ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అప్రమత్తం చేయడానికి చాలా తక్కువ సమయం ఉండే అవకాశం ఉంది. "ప్రస్తుతం హిమాలయాల్లో సుమారు 200 హిమానీనద సరస్సులు ఉండగా, వాటిలో కనీసం 50 నుంచి 60 వరకు అధిక ప్రమాదకరమైనవిగా వర్గీకరణ జరిగింది. ఉష్ణోగ్రతలు పెరిగి హిమానీనదాలు కరగడంతో సరస్సుల వంటి నిర్మాణాల్లో భారీ పరిమాణంలో కరిగిన నీరు పేరుకుపోతుంది. ఒకవేళ భూకంపం సంభవించినా లేదా సరస్సు గట్లలో పగుళ్లు ఏర్పడినా, ఎత్తైన ప్రదేశాల్లో ఉన్న నీరు అపారమైన వేగంతో కిందికి దూసుకువస్తుంది. ఇది ఆ ప్రవాహాన్ని ఉగ్రరూపం దాల్చే వరదగా మార్చి, దాని మార్గంలో ఉన్న ఇళ్లు, హోటళ్లు, రోడ్లు లేదా వంతెనలు వంటి ప్రతిదాన్నీ కొట్టుకుపోతుంది."

# బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై డబ్ల్యూహెచ్ఓ అలర్ట్

బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో జంతువులు, పక్షులలో ఈ వైరస్ కేసులు వేగంగా వ్యాప్తి చెందడంపై ఆందోళన వ్యక్తం చేసింది. జంతువుల నుంచి మానవులకు బర్డ్‌ఫ్లూ సోకే ప్రమాదం ఉందని అభిప్రాయపడింది. బర్డ్‌ఫ్లూను ఎదుర్కొనేందుకు ఆరోగ్య వ్యవస్థలను ముందస్తుగా సిద్ధం చేయాలని ఆసియా-పసిఫిక్ దేశాలకు సూచించింది. అయితే భారత్‌లో ప్రస్తుతం స్వైన్‌ఫ్లూ (ఎ1చీ1) కేసులు పెరుగుతున్న సమయంలోనే, డబ్ల్యూహెచ్ఓ బర్డ్‌ఫ్లూ అలర్ట్ ఇవ్వడంతో ఈ హెచ్చరికకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఆగస్టు 25- 27 వరకు డబ్ల్యూహెచ్ఓ ఆగ్నేయాసియా, పశ్చిమ పసిఫిక్ ప్రాంతీయ కార్యాలయాలు సంయుక్తంగా బర్డ్‌ఫ్లూ వైరస్ గురించి ఓ సమావేశాన్ని నిర్వహించాయి. ఈ మీటింగ్‌లో 150 మందికి పైగా ఇన్‌ఫ్లుయెంజా నిపుణులు, సైంటిస్టులు, ప్రజారోగ్య అధికారులు పాల్గొన్నారు. పక్షులలో బర్డ్‌ఫ్లూ వ్యాప్తి కొనసాగుతుందని ప్రజారోగ్య నిపుణులు పేర్కొన్నారు. జంతువుల నుంచి మానవులకు ఈ వ్యాధి సోకే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇదే విషయంపై ఈటీవీ భారత్‌లో ఆరోగ్య నిపుణులు, సైంటిస్టులు, వైద్యులు మాట్లాడారు.



**లక్షణాలు ఏంటంటే?**

బర్డ్‌ఫ్లూ సోకిన చాలా మంది రోగులలో జ్వరం, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తాయని అం టువ్యాధుల నిపుణురాలు, మెడికల్ మైక్రోబయాలజిస్ట్ డాక్టర్ మనాలి అగర్వాల్ తెలిపారు. ఈ లక్షణాలతో పాటు న్యుమో నియాకు సంబంధించిన లక్షణాలు కూడా కనిపిస్తాయని చెప్పారు. తరచుగా కనిపించే శ్వాసకోశేతర లక్షణాలలో విరేచ నాలు, వాంతులు, కడుపు నొప్పి ఉన్నాయని వివరించారు. ఈ మహమ్మారి నుంచి ప్రజలను కాపాడడానికి సన్నద్ధత చాలా కీలకమన్నారు. "ముందుగా బర్డ్‌ఫ్లూ అంటే ఏమిటో మనం అర్థం చేసుకోవాలి. ఇది ఇన్‌ఫ్లుయెంజా వైరస్ ఉప రకం. ఇది పక్షులు, క్షీరదాలకు సోకుతుంది. అరుదుగా మానవులకు కూడా సంక్రమిస్తుంది. ఈ ఇన్ఫెక్షన్ సోకిన పక్షులు, ఇతర జంతువులతో సన్నిహితంగా ఉండటం, కలుషితమైన పరిసరాల వల్ల ఆ వ్యాధి మానవులకు సోకే ప్రమాదం ఉంది. మానవుల మధ్య ఈ వైరస్ సోకిన దాఖలాలు ఇప్పటివరకు లేవు. బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్లను తాకడం, అనారోగ్యంతో ఉన్న కోళ్లను తినడం వల్ల మనుషులకు బర్డ్‌ఫ్లూ సోకే అవకాశం ఉంది. పక్షుల నుంచి మానవులకు బర్డ్‌ఫ్లూ శ్వాసకోశ మార్గం, జీర్ణకోశ మార్గం, కంటి పొర ద్వారా వ్యాపిస్తుంది" అని మనాలి అగర్వాల్ పేర్కొన్నారు.

**'డబ్ల్యూహెచ్ఓ సూచనకు అలర్ట్‌గా చూడాలి'**

బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన పిలుపును పరిస్థితికి ప్రతిస్పందనగా కాకుండా, మరో భిన్నమైన ఇన్‌ఫ్లుయెంజా ముప్పు గురించి ఇచ్చిన హెచ్చరికగా చూడాలని ప్రముఖ ఆరోగ్య నిపుణుడు, ఏషియన్ సొసైటీ ఆఫ్ ఎమర్జెన్సీ మెడిసిన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ తమోరిశ్ కోలే అభిప్రాయపడ్డారు. స్వైన్‌ఫ్లూ అనేది ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే ఒక కాలానుగుణ ఇన్‌ఫ్లుయెంజా వైరస్ అని తెలిపారు. అయితే బర్డ్‌ఫ్లూ మాత్రం వ్యాధి సోకిన పక్షుల నుంచి, లేదంటే కలుషితమైన పరిసరాల నుంచే మానవులకు వ్యాపిస్తుందని పేర్కొన్నారు. దేశంలో పెద్ద ఎత్తున పౌల్ట్రీ రంగం, పెంపుడు కోళ్లు, లైవ్ బర్డ్స్ మార్కెట్లు, వలస పక్షుల మార్గాల ఉన్నాయని చెప్పారు.

## ఖర్గే సభా వేదికను శుద్ధి చేయడం నేరమే

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ నిర్వహించిన వేదికను శుద్ధీకరణ చేసిన ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో జరిగిన ఆ ఘటన నేరమని అన్నారు. ఆ వ్యవహారంపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని డిమాండ్ చేశారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరారు. ఈ మేరకు దిల్లీలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో పలు వ్యాఖ్యలు చేశారు హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో ఆగస్టు 8వ తేదీన ఖర్గే కాంగ్రెస్ సభలో ప్రసంగించారు. ఆయన ప్రసంగం అనంతరం ఆగస్టు 10వ తేదీన కొందరు అక్కడ శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించినట్లు కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఆ ఘటనను ప్రస్తావించిన రాహుల్, శుద్ధీకరణ పేరుతో దళితులను అంటరానివారిగా చూపుతున్నారని విమర్శించారు. శుద్ధీకరణ అనేది అంటరానితనానికి మరో పేరు అంటూ అభిప్రాయపడ్డారు. 'దళితులు తాకకూడని వారు, అపవిత్రులు అన్న భావనను ఇది వ్యక్తం చేస్తోంది. రాజ్యాంగం అంటరానితనాన్ని నిషేధించింది. అలాంటి చర్యలు నేరం' అని రాహుల్ అన్నారు.

**'బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు చెందిన వారే'**

అయితే ఆ ఘటనలో ఆర్ఎస్ఎస్, బీజేపీకి చెందిన వారే ఉన్నారని, ఉత్తరాఖండ్ బీజేపీ అధ్యక్షుడు మహేంద్ర భట్ శుద్ధీకరణ కార్యక్రమాన్ని సమర్థించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. 'బీజేపీ ఉత్తరాఖండ్ అధ్యక్షుడే శుద్ధీకరణను సమర్థిస్తున్నారు. అదే సమయంలో ప్రధాని మోదీ తాను అన్ని కులాలకు చెందిన వ్యక్తినని చెబుతున్నారు. మరి దళిత నాయకుడికి జరిగిన అవమానంపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు' అంటూ ప్రశ్నించారు. ఇక ఆగస్టు 13వ తేదీన రాజ్యసభలో ఆ అంశాన్ని మల్లికార్జున ఖర్గే ప్రస్తావించారని రాహుల్ గాంధీ ప్రస్తావించారు. ఘటనకు పాల్పడిన వారిపై అంటరానితన నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఖర్గే డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 'కాంగ్రెస్ అధ్యక్షుడి తరఫున మేం న్యాయం కోరుతున్నాం. ఉత్తరాఖండ్‌లో ఖర్గేకు న్యాయం జరగాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయనకు న్యాయం జరిగే చూడాలి' అని రాహుల్ అన్నారు.

**'దళితలను గౌరవించేందుకు బీజేపీ సిద్ధంగా లేదు'**

ఘటనను కేవలం ఒక రాజకీయ వివాదంగా చూడకూడదని, దేశంలో కుల వివక్షకు సంబంధించిన సమస్యగా చూడాలని రాహుల్ కోరారు. దళితలను గౌరవించేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధంగా లేవని ఆరోపించారు. దేశంలో దళితులపై వివక్ష ఇంకా కొనసాగుతోందని అన్నారు. రాజ్యాంగం ఇలాంటి వివక్షను నిషేధించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో దళిత పిల్లలను పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రం చేయించడం, నేలలు ఊడ్చించడం వంటి ఘటనలు జరుగుతున్నాయంటూ ఆరోపణలు చేశారు. గ్రామాల్లో సామూహిక బావుల నుంచి దళితులకు నీళ్లు తీసుకునేందుకు అనుమతి ఇవ్వని ఘటనలు ఉన్నాయని కాంగ్రెస్ అగ్రనేత అన్నారు. కొన్ని టీ దుకాణాల్లో దళితుల కోసం ప్రత్యేకంగా పేపర్ లేదా ప్లాస్టిక్ కప్పులు, ఇతరుల కోసం గాజు కప్పులు ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. దళిత వరుడు గుర్రంపై ఊరేగింపుగా వెళ్లే సమయంలో దాడులకు గురవుతారనే భయంతో హెల్మెట్ ధరించే పరిస్థితులు కూడా ఉన్నాయని అన్నారు. ఇదే మన దేశ వాస్తవ పరిస్థితి అంటూ వ్యాఖ్యానించారు.

**'రెండు సిద్ధాంతాల మధ్య పోరాటం'**

దేశంలో ప్రస్తుతం రెండు సిద్ధాంతాల మధ్య పోరాటం జరుగుతోందని రాహుల్ గాంధీ అన్నారు. ఒకవైపు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ వంటి నాయకుల ఆలోచనలతో రూపొందిన రాజ్యాంగం ఉందని, మరోవైపు బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. 'వేల సంవత్సరాలుగా దళితులపై హింస, వివక్ష కొనసాగింది. రాజ్యాంగం దాన్ని చట్టవిరుద్ధం చేసింది. అయినప్పటికీ నేటికీ ఇలాంటి ఘటనలు కనిపిస్తున్నాయి' అని అన్నారు. అదే విషయాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాజస్థాన్ కాంగ్రెస్ నేత టికారామ్ జూలీ, కేంద్ర మాజీ మంత్రి జితిన్ రామ్? మాంఝీ వంటి దళిత నేతలు వేర్వేరు సందర్భాల్లో ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నారని రాహుల్ పేర్కొన్నారు. ఒక దళితుడు ఎంత విజయవంతమైతే, అతడిపై దాడులు అంత తీవ్రంగా ఉంటాయని అన్నారు. అయితే హల్ద్వానీ ఘటనపై కాంగ్రెస్ విమర్శలు చేయడాన్ని ఇప్పటికే బీజేపీ ఖండించింది. పార్టీ ఇలాంటి కార్యకలాపాలను సమర్థించదని కేంద్ర మంత్రి జేపీ నడ్డా గతంలో స్పష్టం చేశారు. ఘటనపై దర్యాప్తు చేస్తామని తెలిపారు.

## ఎల్ఓసీ వద్ద పాక్ డ్రోన్ కలకలం



జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ డ్రోన్ సంచారం కలకలం రేపింది. ఎల్ఓసీ వెంబడి మెంధర్ సెక్టార్‌లోని బాలాకోట్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి డ్రోన్ చక్కర్లు కొట్టడాన్ని భద్రతా దళాలు గుర్తించాయి. దీంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు సరిహద్దు జిల్లాలను జల్లెడపడుతున్నాయి. డ్రోన్ ఏదైనా అనుమానాస్పద వస్తువులను జారవిడిచిందా? లేదా ఏమైనా తీసుకెళ్లిందా? అనే కోణంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అధికారుల తెలిపిన వివరాల ప్రకారం, బాలాకోట్ ప్రాంతంలోని బెహ్రూటి గ్రామం వద్ద రాత్రి 8:05 గంటల ప్రాంతంలో ఓ డ్రోన్ కనిపించింది. కొంతసేపు ఆ ప్రాంతంలో చక్కర్లు కొట్టిన డ్రోన్, అనంతరం సరిహద్దుకు సమీపంలోని మంగళ్‌నార్-డబ్రోట్ వైపు కదిలినట్లు అధికారులు గుర్తించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే తిరిగి పాకిస్థాన్ వైపు వెళ్లిపోయినట్లు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన బలగాలు నిఘాను మరింత పెంచాయి. తెల్లవారుజామున రంగంలోకి దిగి ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. అలాగే సరిహద్దు ప్రాంతంలో భద్రతా దళాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయని అధికారుల చెప్పారు. డ్రోన్ కదలికలపై నిఘా కొనసాగుతోందని, అనుమానాస్పదంగా ఏదైనా గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకునేందుకు బలగాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. పూంచ్‌తో పాటు జమ్ము ప్రాంతంలోని మరికొన్ని జిల్లాల్లోనూ భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఉధంపూర్, కఠువా, రాజౌరి జిల్లాల పరిధిలోని దట్టమైన అటవీ ప్రాంతాల్లో పోలీసులు, సైన్యం, సీఆర్పీఎఫ్ బలగాలు సంయుక్తంగా బరిలోకి దిగాయి. శుక్రవారం సాయంత్రం నుంచి ఉధంపూర్-కఠువా అటవీ బెల్ట్‌లోని కుబాన్, నగేన్, ఖత్రైల్, గోడు ఫలాల్, పదేతర్, చోర్ మొట్టు, కియా, ఖేబా, భేద్, మార్తా, జోఫర్ తదితర మారుమూల గ్రామాలను జల్లెడపడుతున్నాయి.

**ఇద్దరు సాయుధులు**

ఇదే సమయంలో రాజౌరి జిల్లాలోని గైబాస్, మిథియాని, మోగ్లా, నర్లా ప్రాంతాల్లో ఇద్దరు సాయుధులు సంచరిస్తున్నట్లు గ్రామస్థులు సమాచారం ఇవ్వడంతో సైన్యం రంగంలోకి దిగింది. బలగాలు ఆ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. దట్టమైన అడవులు, కొండ ప్రాంతాల గుండా గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. అనుమానితులు ఉగ్రవాదులై ఉండొచ్చన్న అనుమానంతో పోలీసులు, సైన్యం, పారామిలిటరీ బలగాలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు ఆ సాయుధుల గురించి ఎటువంటి సమాచారం లభించలేదు. ఈ ఏడాది ప్రారంభంలోనూ పాకిస్థాన్?కు చెందిన డ్రోన్లు జమ్ముకశ్మీర్?లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా భద్రతా దళాలు తిప్పికొట్టాయి. మార్చి 1న జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ వద్ద పాకిస్థాన్‌కు చెందిన డ్రోన్లు భారత గగనతలంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించాయి. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు సరిహద్దుల గుండా చొరబడేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, భారత భద్రతా దళాలు వాటిని ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నాయి. ప్రస్తుతం ఉధంపూర్, కఠువా, రాజౌరి, పూంచ్ జిల్లాల్లో కొనసాగుతున్న తనిఖీలతో కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇదిలా ఉండగా కొంతకాలం క్రితం జమ్మూకశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి భారీగా మాదక ద్రవ్యాలు పట్టుబడ్డాయి. పాకిస్థాన్ నుంచి వచ్చిన డ్రోన్ ద్వారా వాటిని జారవిడిచినట్లు అధికారులు అనుమానించారు. ఫిబ్రవరి 13న అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో 6.5 కిలోలకు పైగా హెరాయిన్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. పట్టుబడిన మాదక ద్రవ్యాల విలువ రూ.40 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం జరిగిన ఈ ఘటనలో కూడా పాకిస్థాన్ డ్రోన్ 'ఏదైనా అనుమానాస్పద వస్తువు విడిచిందా' అనే విషయంపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

RNI No: APTEL/2020/1906
స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# ఏకాధి సిల్వర్ జ్యువెలరీ స్టోర్ ప్రారంభం



సందడి చేసిన హీరోయిన్ నిధి అగర్వాల్

నాణ్యమైన వెండి ఆభరణాలు, వినూత్న డిజైన్లతో సరికొత్త షాపింగ్ అనుభూతి



స్వర్ణసాగరం నెల్లూరు

నగరంలోని ఆచారి వీధిలో ఏర్పాటు చేసిన 'ఏకాధి సిల్వర్ జ్యువెలరీ' ఎక్స్‌క్లూజివ్ స్టోర్‌ను సినీ నటి నిధి అగర్వాల్ శనివారం ప్రారంభించారు. నాణ్యమైన వెండి ఆభరణాలు, వినూత్న డిజైన్లతో నగర ప్రజలకు సరికొత్త షాపింగ్ అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఈ స్టోర్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రారంభోత్సవానికి నగర ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఏకాధి డైరెక్టర్ వేణు రాచకొండ మాట్లాడుతూ, నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా ప్రత్యేకమైన వెండి ఆభరణాలను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. మరో డైరెక్టర్ శివ చరణ్ వుప్పలంచి మాట్లాడుతూ, సంప్రదాయంతో పాటు ఆధునిక పోకడలకు అనుగుణంగా ప్రతి మహిళను ఆకట్టుకునే డిజైన్లను రూపొందిస్తున్నట్లు చెప్పారు. నెక్లెస్‌లు, హారాలు, చెవి దుద్దులు, గాజులు, బ్రాస్‌లెట్లు, ఉంగరాలు, జుంకాలు, లాకెట్లు తదితర వెండి ఆభరణాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు. సినీ నటి నిధి అగర్వాల్ రాకతో స్టోర్ పరిసరాలు సందడిగా మారాయి. అభిమానులను పలకరించిన ఆమె కొంతమందితో సెల్ఫీలు దిగారు. కార్యక్రమంలో నెల్లూరు ఫ్రాంచైజీ భాగస్వాములు వానరాసి గౌతమ్, కొండేటి సాయి కృష్ణ, యన్నారు వెంకటేష్ పాల్గొన్నారు.

# ప్రజారోగ్య రంగంలో విప్లవం.. సంజీవని

-మొదటిపేజీ తరువాయి

కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, మారుమూల ప్రాంతాల్లో కనెక్టివిటీ పెంచేందుకు సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి రోగుల రక్త నమూనాలను డ్రోన్ల ద్వారా పెద్ద ఆసుపత్రులకు తరలించి పరీక్షలు నిర్వహించి చికిత్స అందించేలా చర్యలు చేపట్టామని సీఎం తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఔషధాలు, వ్యాక్సీన్లను కూడా డ్రోన్ల ద్వారా తరలించే వ్యవస్థను అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా గర్భిణులకు సేవలందించడంతో పాటు 104 వాహనాల ద్వారా సంచార వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఇంటి వద్దే 41 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటికే కుప్పం నియోజకవర్గం, చిత్తూరు జిల్లాలో సంజీవని ప్రాజెక్టును అమలు చేస్తున్నామని, ఇది రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనూ గేమ్‌చేంజర్‌గా మారుతుందని అన్నారు. అత్యవసర వైద్య సేవల కోసం అల్లూరి జిల్లాలో 150 వాహనాలతో ఎమర్జెన్సీ లైఫ్‌లైన్ నెట్‌వర్క్ ఉందని తెలిపారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐదు సూత్రాలతో ప్రణాళికలు రూపొందించామని చంద్రబాబు తెలిపారు. 'అడవి తల్లి బాట' పేరుతో రూ.1,000 కోట్లతో 905 కిలోమీటర్ల రహదారులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. 1.60 లక్షల ఇళ్లకు కుళాయి ద్వారా నీరు అందించడంతో పాటు సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచేందుకు అరకు కాఫీని మరో లక్ష ఎకరాల్లో సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అరకు ప్రాంతానికి పర్యాటకుల సంఖ్య పెరిగిందని, హోమ్‌స్టేల ద్వారా పర్యాటకులకు ఆతిథ్యం అందిస్తే గిరిజన కుటుంబాలకు ఆదాయం వస్తుందని చెప్పారు. పరిశ్రమల్లో గిరిజన యువతకు ఉద్యోగాలు దక్కేలా నైపుణ్యాభివృద్ధి కల్పిస్తామని, వచ్చే మూడేళ్లలో లక్ష మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలన్నీ స్థానికులకే దక్కేలా జీఓ నంబర్ 3ను తమ ప్రభుత్వమే తీసుకొచ్చిందని సీఎం అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా సుప్రీంకోర్టు దాన్ని రద్దు చేసిందని ఆరోపించారు. అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయాన్ని త్వరలో తీసుకొస్తామని తెలిపారు. గిరిజన బిడ్డలు దేశంలోని అత్యుత్తమ విద్యాసంస్థల్లో చదవాలన్న ఉద్దేశంతో ఐఐటీ మద్రాస్‌తో ఒప్పందం చేసుకున్నామని, ఐఐటీ, నీట్ వంటి పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ అందిస్తున్నామని చెప్పారు. గిరిజన రైతులు తమ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌కు తరలించేలా చేయూత అందించడమే ప్రభుత్వ ఆలోచన అని తెలిపారు. పిల్లలే మన సంపద అనే సిద్ధాంతాన్ని గిరిజన ప్రాంతాల ప్రజలు ఆచరిస్తుండటం గర్వకారణమన్నారు. 2014లో విశాఖ జిల్లాలో ఏర్పాటు చేసిన మెడ్‌టెక్ జోన్ ప్రస్తుతం ప్రపంచస్థాయి వైద్య పరికరాలను తయారు చేస్తోందని, కరోనా సమయంలో పెద్దఎత్తున వైద్య పరికరాలను అందించిందని చెప్పారు. మెడ్‌టెక్ జోన్ ఉత్పత్తులను అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం ద్వారా ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్టుకు కృష్ణా జలాలు అందుతాయని, సెప్టెంబర్ 2న పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తీసుకొస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే డీఎస్సీ ద్వారా పెద్దఎత్తున ఉద్యోగాలు ఇచ్చామని, తొలి సంతకంతో 16 వేల ఉద్యోగాలు ఇస్తే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేసి వ్యవస్థలను అస్తవ్యస్తం చేశారని చంద్రబాబు విమర్శించారు. జే బ్రాండ్లు, కల్తీ మద్యం ద్వారా కొన్ని వేల మంది ప్రాణాలు కోల్పోయి ప్రజల ఆరోగ్యం నాశనమైందని ఆరోపించారు. జే బ్రాండ్లను రద్దు చేసి మద్యం విధానాన్ని ప్రక్షాళన చేశామని చెప్పారు. గతంలో గంజాయి కారణంగా ఏజెన్సీ ప్రాంతానికి చెడ్డపేరు తెచ్చారని విమర్శించారు. ప్రస్తుతం కాఫీ, మిరియాలు వంటి ప్రత్యామ్నాయ పంటలతో గిరిజనులకు ఆదాయ మార్గాలు చూపుతున్నామని తెలిపారు. గ్రూప్-1 పరీక్షల్లో గత పాలకులు అవకతవకలకు పాల్పడి అభ్యర్థుల జీవితాలతో ఆడుకున్నారని ఆరోపించారు. ఆర్డీఓ స్థాయి అధికారులను ఎంపిక చేసే పరీక్షా పత్రాలను ఎలక్ట్రీషియన్, అటెండర్‌తో దిద్దించారని విమర్శించారు. గత పాలనలో దేవాలయాల ప్రతిష్ఠను దెబ్బతీశారని, బలవంతపు మత మార్పిడులకు పాల్పడ్డారని చంద్రబాబు ఆరోపించారు. మత విశ్వాసాలను ఎవరూ తప్పుపట్టరని, అయితే బలవంతంగా మత మార్పిడి చేయడం సరికాదన్నారు. గత పాలకుల ఐదేళ్లలో దేవాలయాలపై దాడులు జరిగాయని, వాటి పవిత్రతను దెబ్బతీశారని విమర్శించారు. వారి పార్టీలో ఉండాలంటే మత మార్పిడి చేసుకోవాల్సిన పరిస్థితి తెచ్చారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలపైనా ఆ పార్టీ నేతలు పూటకో మాట మాట్లాడుతున్నారని సీఎం ఎద్దేవా చేశారు. గతంలో ఏకగ్రీవాలను సమర్థించిన వారు ఇప్పుడు ఎక్కడా ఏకగ్రీవాలు జరగకూడదని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, గుమ్మిడి సంధ్యారాణితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవాలపై అధికారంలో ఒక మాట...ఇప్పుడొక మాట

-మొదటిపేజీ తరువాయి

సంతరించుకున్నాయి. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా భ్రష్టుపట్టించారని చంద్రబాబు ఆరోపించారు. 'జే బ్రాండ్లు' పేరుతో కల్తీ మద్యం అమ్మి వేల మంది ప్రాణాలతో చెలగాటమాడారని, ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక మద్యం విధానాన్ని ప్రక్షాళన చేశామని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో బలవంతపు మత మార్పిడులకు పాల్పడ్డారని, దేవాలయాల పవిత్రతను దెబ్బతీశారని ఆరోపించారు. ఆర్డీఓ స్థాయి అధికారులను ఎంపిక చేసే గ్రూప్-1 పరీక్ష పత్రాలను ఒక ఎలక్ట్రీషియన్, అటెండర్‌తో దిద్దించి అభ్యర్థుల జీవితాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. ఇక తన పర్యటన ముఖ్య ఉద్దేశమైన 'సంజీవని' ప్రాజెక్టు వివరాలను సీఎం వెల్లడించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రజల చెంతకే వైద్యం అందించే ఈ ప్రాజెక్టు, ఆరోగ్య రంగంలో తదుపరి స్థాయి విప్లవమని అభివర్ణించారు. ప్రతి కుటుంబానికి డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందించి, వారి ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు.

గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాల మెరుగుదలకు రూ.250 కోట్లతో 'ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంప్లీషన్ మిషన్' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సికిల్‌సెల్, తలసేమియా బాధితులకు నెలకు రూ.10 వేల పెన్షన్ అందిస్తున్నామని, త్వరలో అన్ని మండలాల్లో జన ఔషధి కేంద్రాలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. డ్రోన్ల ద్వారా మారుమూల ప్రాంతాలకు మందులు, వ్యాక్సిన్లు పంపడంతో పాటు రక్త నమూనాలను ల్యాబ్‌లకు తరలించి మెరుగైన వైద్యం అందిస్తామని వివరించారు.

గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి తమ ప్రభుత్వం ఐదు సూత్రాల ప్రణాళికతో ముందుకెళుతోందని చంద్రబాబు తెలిపారు. 'అడవి తల్లి బాట' పేరుతో రూ.1,000 కోట్లతో 905 కిలోమీటర్ల రోడ్లు నిర్మిస్తున్నామని, 1.60 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇస్తామని చెప్పారు. అరకు కాఫీ సాగును మరో లక్ష ఎకరాలకు విస్తరించి, హోమ్‌స్టేల ద్వారా పర్యాటకాన్ని ప్రోత్సహించి గిరిజనులకు ఆదాయ మార్గాలు పెంచుతామన్నారు. స్థానిక యువతకు ఉద్యోగాల కోసం తీసుకొచ్చిన జీఓ నంబర్ 3ని గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే సుప్రీంకోర్టు రద్దు చేసిందని, త్వరలోనే అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయం తెస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక ప్రాజెక్టులపైనా చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. ఆగస్టు 31న వెలిగొండ ప్రాజెక్టుకు కృష్ణా జలాలను, సెప్టెంబర్ 2న పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి జలాలను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, గుమ్మిడి సంధ్యారాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్, బీడీఎస్ ఫీజులు 10 శాతం పెంపు

రాష్ట్రంలో వైద్య విద్య కోర్సులకు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలో వసూలు చేయాల్సిన ఫీజులను ప్రభుత్వం ప్రకటించింది. తొలి విడత కౌన్సెలింగ్ నిర్వహణకు దీనితో మార్గం సుగమమైంది. గతేడాదితో పోలిస్తే ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు 10 శాతం, పీజీ మెడికల్ కోర్సులకు 15 శాతం, సూపర్ స్పెషాలిటీ కోర్సులకు 15 శాతం పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈమేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండ్యన్ ఆదేశాలిచ్చారు.

గతేడాది కంటె 10 శాతం

రాష్ట్రంలో వైద్య విద్య కోర్సులకు ప్రైవేట్ కళాశాలల్లో ఫీజులను నిర్ణయించారు. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు గతేడాది కంటే 10 శాతం, పీజీ కోర్సులకు, సూపర్ స్పెషాలిటీ కోర్సులకు 15 శాతం ఫీజు పెంపుదల చేస్తున్నట్టు ఉత్తర్వులు వెలువరించారు. ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా ఏ-కేటగిరికి రూ. 18,150, బీ-కేటగిరికి (మేనేజ్?మెంట్ కోటా) రూ.14.52లక్షలు, సీ-కేటగిరి(ఎన్నారై కోటా) రూ.43.56 లక్షల ఫీజులను నిర్ణయించారు. బీడీఎస్ కన్వీనర్ కోటా ఏ-కేటగిరికి రూ.15,730, బీ-కేటగిరికి రూ.4.84లక్షలు, సీ-కేటగిరికి రూ. 14.52 లక్షలుగా నిర్ణయించారు.

మెడికల్ పీజీ కోర్సులకు

మెడికల్ పీజీ కోర్సులకు క్లినికల్ డిగ్రీ ఏ-కేటగిరికి రూ.5,71,320, బీ-కేటగిరికి రూ.11,42,640, సీ-కేటగిరికి రూ.66,12,500 పారాక్లినికల్ డిగ్రీ, డిప్లమా ఏ-కేటగిరికి రూ.1,78,538, బీ-కేటగిరికి రూ.3,57,075, సీ-కేటగిరికి రూ.19,83,750 ప్రీ క్లినికల్ డిగ్రీ ఏ-కేటగిరికి రూ.80,937, బీ-కేటగిరికి రూ. 1,61,874, సీ-కేటగిరికి రూ.10,58,000గా నిర్ణయించారు. డెంటల్ క్లినికల్ పీజీ డిగ్రీ ఏ-కేటగిరికి రూ. 3,92,783, బీ-కేటగిరికి రూ.7,85,565, సీ-కేటగిరికి రూ.15,87,000 కాగా, పారా క్లినికల్ డెంటల్ పీజీ ఎ-కేటగిరికి రూ.3,53,504, బీ-కేటగిరికి రూ.5,74,759, సీ-కేటగిరికి రూ.9,25,750 నిర్ణయించారు. సూపర్ స్పెషాలిటీ కోర్సులకు జీఎస్ఎల్?, కస్తూరి, నారాయణ, ఎన్నారై, డాక్టర్ సిద్దార్థ మెడికల్ కళాశాలల్లో రూ. 19,83,750 ఫీజు ఉంటుందని ఉత్తర్వులలో తెలిపారు. ఈమేరకు మూడు వేర్వేరు జీవోలను రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కార్యదర్శి వీరపాండ్యన్ విడుదల చేశారు.

కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ కోర్సులో కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. మొదటి విడత కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్ ఆప్షన్ల నమోదుకు షెడ్యూల్‌ను ప్రకటించింది. ఇవాళ ప్రకటించిన తుది మెరిట్ జాబితాలో పేరున్న అభ్యర్థులందరూ వెబ్?ఆప్షన్లు ఇవ్వడానికి అర్హులని వెల్లడించింది.

## నీట్ పీజీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

### పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ



విజయవాడ, స్వర్ణసాగరం

ఈ నెల 30వ తేదీ ఆదివారం జరిగే నీట్ పీజీ-2026 పరీక్షను సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. పరీక్ష సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. విజయవాడలోని పీఎస్‌సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, ఎనికేపాడులోని శ్రీ విజయదుర్గ ఐటీ ఇన్ఫో సొల్యూషన్స్‌లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, మొత్తం 843 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ లక్ష్మీశ శనివారం పీఎస్‌సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి పరీక్ష నిర్వహణకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనను పరిశీలించారు. భద్రత, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే కంప్యూటర్ ఆధారిత పరీక్షను పారదర్శకంగా, ప్రశాంతంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సూచించారు.

## విశాఖ లారీ డ్రైవర్ ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

### వీడియోలోని కొంత భాగం ఆధారంగా ఏఎంవీఐని బాధ్యుడిగా నిర్ధారించడం సరికాదు

### ఏపీ ట్రాన్స్‌పోర్ట్ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్



విజయవాడ, స్వర్ణసాగరం

విశాఖపట్నంలో లారీ డ్రైవర్‌పై జరిగిన దాడి ఘటనపై సమగ్ర, నిష్పాక్షిక విచారణ జరిపి పూర్తి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌పోర్ట్ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలోని కొంత భాగాన్ని మాత్రమే ఆధారంగా చేసుకుని అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ)ను ఘటనకు బాధ్యుడిగా నిర్ధారించడం సరికాదని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. ప్రవీణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీఎల్ సిద్ధిక్ పేర్కొన్నారు. విజయవాడ బందరు రోడ్డులోని డీటీసీ కార్యాలయ ప్రాంగణంలోని అసోసియేషన్ భవనంలో శనివారం విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ, పూర్తి వాస్తవాలు వెలుగులోకి రాకముందే ఎడిట్ చేసిన లేదా పరిమిత దృశ్యాల ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగిని దోషిగా చిత్రీకరించడం సముచితం కాదన్నారు. ప్రస్తుతం వైరల్ అవుతున్న వీడియోలో లారీ క్యాబిన్‌లో డ్రైవర్‌పై జరిగిన దాడిలో ఏఎంవీఐ ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు కనిపించడం లేదని, అక్కడ కార్ డ్రైవర్ పాత్రకు సంబంధించిన దృశ్యాలు మాత్రమే కనిపిస్తున్నాయని తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వీడియో ఫుటేజీ, సీసీటీవీ దృశ్యాలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, ఘటనకు ముందు, తరువాత జరిగిన పరిణామాలు, సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలను పరిశీలించి సమగ్రంగా దర్యాప్తు చేయాలని పోలీసు అధికారులను కోరారు. ఆధారాలతో ఎవరైనా తప్పు చేసినట్లు నిర్ధారణైతే చట్టప్రకారం చర్యలు తీసుకోవడాన్ని తమ సంఘం వ్యతిరేకించదని, అయితే అసంపూర్ణ వీడియోలు, అపోహల ఆధారంగా ఏఎంవీఐని బాధ్యుడిగా నిర్ధారించడం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. వాస్తవాల ఆధారంగానే తదుపరి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## గ్రూప్-1కు మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

అమరావతి, స్వర్ణసాగరం



రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్--2026లో భాగంగా గ్రూప్-1 పరీక్షలకు సిద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు మైనారిటీ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఉచిత శిక్షణకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు శనివారం అమరావతిలో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్-1 పరీక్షలకు మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సీఈడీఎం-ఏపీ) ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. మైనారిటీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువత ఉన్నత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సమాజంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఉచిత శిక్షణా తరగతులకు అభ్యర్థులను పారదర్శకంగా ఎంపిక చేసేందుకు రాష్ట్రంలోని వివిధ కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు, ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మాత్రమే ఉచిత శిక్షణ పొందే అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి, అర్హత కలిగిన మైనారిటీ అభ్యర్థులు సీఈడీఎం-ఏపీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆఫ్‌లైన్ శిక్షణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు డిగ్రీలో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండటంతో పాటు తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబానికి చెందిన వారై ఉండాలని, అయితే ఆన్‌లైన్ శిక్షణ పొందాలనుకునే వారికి ఈ నిబంధన వర్తించదని స్పష్టం చేశారు. ప్రవేశ పరీక్ష కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదు ప్రక్రియ ఆగస్టు 31 నుంచి ప్రారంభమై సెప్టెంబర్ 10తో ముగుస్తుందని తెలిపారు. అభ్యర్థుల అర్హతలు, ప్రవేశ పరీక్ష షెడ్యూల్, ఇతర వివరాలను సీఈడీఎం-ఏపీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా జాబ్ క్యాలెండర్--2026లో భాగంగా త్వరలో విడుదల కానున్న గ్రూప్-2 ఉద్యోగ నోటిఫికేషన్‌ను దృష్టిలో ఉంచుకుని మైనారిటీ అభ్యర్థులకు గ్రూప్-2 పరీక్షలకు కూడా ఉచిత శిక్షణ అందించనున్నట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. దీనికి సంబంధించి మైనారిటీ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రకటన విడుదల చేస్తుందని, ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత శిక్షణను మైనారిటీ యువత సద్వినియోగం చేసుకుని పట్టుదలతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.

swarna sagaram_Swarna sagaram.qxd 8/29/2026 11:07 PM Page 1



# కార్యాలయానికి రాని ఏపీఎంలు..

## ఇబ్బందుల్లో పొదుపు సంఘ సభ్యులు!

**సమయపాలనపై సభ్యుల ఆరోపణలు...పర్యవేక్షణ ఎక్కడంటూ ప్రశ్నలు**

**ఫేషియల్ యాప్ ఉన్నా మారని పరిస్థితి...ఉన్నత అధికారులు స్పందించాలని విజ్ఞప్తి**

నాయుడుపేట (స్వర్ణ-సాగరం)ఆగస్టు 29

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలోని కొన్ని మండలాల్లో ఏపీఎంల (అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లు) పనితీరుపై పొదుపు సంఘాల సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కార్యాలయ సమయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని, దీంతో తమకు అవసరమైన సేవల కోసం కార్యాలయాలకు వచ్చే సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

**ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయంలో ఉండాల్సిందే..**

పొదుపు సంఘాల కార్యకలాపాలతో ఏపీఎంలకు ప్రత్యక్ష సంబంధం ఉండటంతో, సభ్యులకు అవసరమైన సమయంలో సంబంధిత కార్యాలయంలో అందుబాటులో ఉండాల్సిన బాధ్యత వారిపై ఉందని సభ్యులు పేర్కొంటున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిబ్బంది కార్యాలయంలో అందుబాటులో ఉండడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.తమ అవసరాల కోసం కార్యాలయాలకు వెళ్లినప్పుడు బ్యాంకు పనుల్లో ఉన్నామని, సమావేశానికి వెళ్లామని, ఇతర అధికారిక కార్యక్రమాల్లో ఉన్నామని వివిధ కారణాలు చెబుతు న్నారని కొందరు సభ్యులు అంటున్నారు. దీంతో చిన్నచిన్న పనుల కోసం కూడా పలుమార్లు కార్యాల యాల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు.




**ఫేషియల్ యాప్ ఉన్నా.. పరిస్థితిలో మార్పు లేదా?**

సిబ్బంది హాజరు,సమయపాలనను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ఫేషియల్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేస్తున్నప్పటికీ, కొన్ని మండలాల్లో క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఆశించిన స్థాయిలో లేవని సభ్యులు చెబుతున్నారు. కార్యాలయానికి నిర్ణీత సమయంలో వచ్చి విధులు నిర్వహిస్తున్నారా? లేక హాజరు నమోదు మాత్రమే చేసి ఇతర పనుల్లో ఉంటున్నారా? అనే అంశంపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.అదేవిధంగా ఏపీఎంలు నిర్వహించా ల్సిన విధులు, కార్యాలయంలో వారి అందుబాటు, పొదుపు సంఘాల సభ్యులకు అందుతున్న సేవలపై క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహించాలని సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**పర్యవేక్షణ లోపిస్తే.. ఇబ్బంది పడేది సభ్యులే :**

పొదుపు సంఘాల ద్వారా ఆర్థిక కార్యకలా పాలు నిర్వహిస్తున్న మహిళా సభ్యులకు సమయానికి సమాచారం, మార్గదర్శకత్వం,అవసరమైన సేవలు అందడం కీలకమని పలువురు పేర్కొంటున్నారు. సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల సభ్యుల సమయం వృథా కావడంతో పాటు, ప్రభుత్వ వ్యవస్థపై కూడా ప్రజల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని వారు అంటున్నారు.విధులకు గైర్హాజరు, సమయపాలన ఉల్లంఘన వంటి అంశాలు వాస్తవమైతే సంబంధిత నిబంధనల ప్రకారం అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరుతున్నారు. అదే సమయంలో, సిబ్బంది వాస్తవంగా క్షేత్రస్థాయిలో అధికారిక విధుల్లో ఉన్న సందర్భాలను కూడా పరిగణనలోకి తీసుకుని, వాస్తవ పరిస్థితులను నిర్ధారించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**ఉన్నతాధికారులు దృష్టి సారించాలి :**

సూళ్లూరుపేట నియోజకవర్గంలోని కొన్ని మండలాల్లో ఏపీఎంల పనితీరు, కార్యాలయ సమయపాలన, హాజరు నమోదు, సభ్యులకు అందుతున్న సేవలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పొదుపు సంఘాల సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.ఫేషియల్ అటెండెన్స్ వివరాలను పరిశీలించడంతో పాటు, ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని కోరుతున్నారు. విధుల్లో నిర్లక్ష్యం ఉన్నట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో బాధ్యతగా పనిచేస్తున్న సిబ్బందికి అనవసర ఇబ్బందులు కలగకుండా వాస్తవాల ఆధారంగా వ్యవహరించాలని సూచిస్తున్నారు.ప్రజలతో నేరుగా సంబంధం ఉన్న ప్రభుత్వ వ్యవస్థల్లో సమయపాలన, పారదర్శకత, బాధ్యతాయుతమైన సేవలు అత్యంత కీలకం. ఉన్నతాధికారులు స్పందించి పరిస్థితిని సమీక్షించి, పొదుపు సంఘాల సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

RNI : APTEL/26/A2367 OFFICE : 9440352036
SWARNA SAGARAM TELUGU DAILY
స్వరసాగరం తిరుపతి తెలుగు దినపత్రిక
చిత్తూరు | నెల్లూరు | అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# రాఘువేంద్ర స్వామి ఉత్సవాలు



స్వర్ణసాగరం బైరెడ్డిపల్లి ఆగష్టు 29:-

కలియుగ కల్పవృక్షం, మధ్వ మత ఆరాధ్య గురువు శ్రీ రాఘ వేంద్ర స్వామి355 వ ఆరాధన ఉత్సవాలు లో భాగంగా మొదటి రోజు తీర్థం గ్రామంలో వెలసిన శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయం లో అర్చకులు రమేష్ ఆచార్యులు నిర్మాల్య పూజ, శుద్ధి పుణ్యా హవాచనం చేసి, పంచామృత అభిషేకములు జరిపి, సుగంధ పుష్పాలతో సుందరంగా అలంక రించారు. భక్తులకు తీర్థప్రసా దాలు పంపిణీ చేశారు. ప్రవచ నాలు, మహిళల కీర్తనలు ఆకట్టు కున్నాయి. శ్రీ గురురాజా సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆంధ్ర,కర్ణాటక నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**సర్వేపల్లి నియోజకవర్గంలో 5 రోజులపాటు వివిధ కార్యక్రమాలు**

**వెల్లడించిన సమన్వయ నేత సురేష్ నాయుడు**

వెంకటాచలం స్వర్ణ సాగరం ఆగస్టు 29

సర్వేపల్లి నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు బొబ్బేపల్లి సురేష్ నాయుడు మరియు ~వీజ డైరెక్టర్ గుమ్మినేని వాణి భవాని నాయుడు ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు జననేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మొదటి రోజు సర్వేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నాగంబుట్ల వారి కండ్రిగ గిరిజన కాలనీ నందు అంగన్వాడీ పిల్లలకు స్టేషనరీ పంపిణీ చేశారు కల్లాకపటం కల్మషం లేని పిల్లల ఆశీర్వాదం మా అధినేత పవన్ కళ్యాణ్ కు ఉండాలని ఉంటుందని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ప్రజల సమస్యల పరిష్కారమే కాదు సేవా కార్యక్రమాలు చేయడంలో కూడా



జనసేన పార్టీ ఎప్పుడు కూడా ముందుంటారని ఇదొక నిదర్శనం అదేవిధంగా మా అధినేత పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో ఉండాలని ఈ రాష్ట్రానికి ఆయన ఎంతో అవసరం పేదల కోసం నిరంతరం శ్రమించే పార్టీ జనసేన అదేవిధంగా సర్వేపల్లి నియోజకవర్గం లోని 117 పంచాయతీలో ఉన్నటువంటి గిరిజన కాలనీలో అంగన్వాడీ భవనాలు అధ్వానంగా ఉన్నాయి గత ప్రభుత్వం వీటిపైన దృష్టి పెట్టడం గాని కొత్త భవనాలు నిర్మించాలని అటువంటి



ఆలోచన గాని లేకపోవడం చాలా బాధాకరం నేడు కూటమిలో భాగంగా ఇవన్నీ కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సొంత భవనాల నిర్మించడానికి పేద గిరిజన బిడ్డలు అంగన్వాడి స్కూల్స్ సుభిక్షంగా ఉండే విధంగా బాగా చదువుకునే విధంగా వాళ్ళకి కావాల్సిన వసతులు ఏర్పాటు చేయడంలో మా వంతు మేము కృషి చేస్తామని తెలియజేస్తున్నాం. ఈ కార్యక్రమంలో పినిశెట్టి మల్లికార్జున్, సందూరు శ్రీహరి ,పొట్లూరు వసంత, పొట్లూరు సుబ్రహ్మణ్యం, మంగపతి వంశీ ,మంగపతి సాయి తదితరులు పాల్గొన్నారు...

# తెలుగు భాషకు వన్నెతెచ్చిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి

**జయంతి సందర్భంగా పాఠశాల నిర్వాహకులు**



బుచ్చిరెడ్డిపాలెం స్వర్ణ సాగరం ఆగస్టు 29

తెలుగు భాష కోసం విశేష కృషి చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి ఆగస్టు 29 ని తెలుగు భాషా దినోత్సవం గా మనం నిర్వహించుకుంటున్న సంగతి అందరికీ తెలిసిన విషయమే. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని బుచ్చిరెడ్డిపాలెం శ్రీ గోపాలకృష్ణయ్య పాఠశాల విద్యార్థులు 1.2.3.4.5. తరగతుల విద్యార్థులు శతక పద్యాలను సామూహికంగా ఆలపించారు. విద్యార్థులకు నీతి పద్యాలతో సంస్కారం పెద్దల పట్ల గౌరవం కలిగించేందుకు మన కవులు శతకాలం రచించారు. వాటిని విద్యార్థులకు నేర్పించి అభ్యాసం చేయించడం వల్ల వారిలో భాష పట్ల దేశం పట్ల తల్లిదండ్రుల పట్ల గౌరవభావం కలుగుతుందినీ ప్రయత్నం జరిగింది.

# పి.ఆర్.ఆర్. & వి.ఎస్. డిగ్రీ కళాశాల విడవలూరులో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

విడవలూరు స్వర్ణ సాగరం ఆగస్టు 29

విడవలూరు పి.ఆర్.ఆర్. ఑ వి.ఎస్. ప్రభు త్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో శ్రీ డి.వి. దీనదయాళ్ పి.ఆర్.ఆర్. ఑ వి.ఎస్. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, ప్రముఖ రచయిత బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రా దేవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గిడుగు రామమూర్తి చిత్ర పటానికి పూలమాల అలంకరిం చడం, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపల్ డా. సి.పి. లక్ష్మీ ప్రసూన ప్రారం భోపన్యాసం చేశారు. తెలుగు భాష గొప్పతనం, తెలుగు సాహిత్య వైభవం, మాతృభాషను పరిరక్షిం చుకోవాల్సిన బా ధ్యత వంటి అంశాలను ఆమె వివరించారు. ఈ సందర్భంగా శ్రీ డి.వి. దీనదయాళ్ మాట్లాడుతూ తెలుగు భాష కేవలం సంభాషణకు సంబంధించిన సాధనం మాత్రమే కాదని, అది మన సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్యం, జీవన విధానాలకు ప్రతీక అని పేర్కొన్నారు. గోవిందరాజు సుభద్ర దేవి మాట్లాడుతూ ఆధునిక కాలంలో ఇతర భాషలను నే ర్చుకుంటూనే మా తృభాష త ెలుగును ప్రేమిస్తూ, గౌరవిస్తూ, భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒ క్కరిపై ఉందని తెలిపారు. తెలు గు భాష ప్రాధాన్యతను, మాతృ భాష పరిరక్షణ ఆవశ్యకతను విద్యా ర్థులకు తెలియజేసే ఉద్దే శంతో ఈ కార్యక్రమాన్ని తెలు గు అధ్యాపకులు డా. కె. కరు ణ శ్రీ, పి.ఆర్.ఆర్. ఑ వి.ఎస్. గవ ర్నమెంట్ జూనియర్ కళా శాల వారి సహకారంతో నిర్వ హిం చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీ ఎం. మధుసూ దన రావు, డా. కిరణ్ కుమార్, శ్రీ శ్రీధర శర్మ, శ్రీ సునీల్ శర్మ, శ్రీ కోటేశ్వరరావు, డా. మునిరాజ, డా. నయమ్ తుల్లా, డా. వరలక్ష్మి, శ్రీమతి శార్వాణి, డా. షణ్ముగం, శ్రీ శ్రీహరి, శ్రీమతి శ్రీవాణి, డా. సురేష్ తదితర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.



# గణనాథుని సేవలో ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయి

**స్వామి వారి చిత్రపటం అందజేసిన ఆలయ ఏఈఓ రవీంద్రబాబు**



కాణిపాకం, స్వర్ణ సాగరం ఆగస్టు 29 :

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి , కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, కాణిపాకం ఎస్ఐ నరసింహులు, ఐరాల ఎమ్మార్వో, చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఘనంగా మాతృ దినోత్సవ వేడుకలు

స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రమణయ్య ఆధ్వర్యంలో తెలుగు మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి ముని సుబ్రమణ్యశ్ పాల్గొన్నారు. అనంతరం తెలుగు ఉపా ధ్యాయులు పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయ బృందం చే తెలుగు కవులు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వ్యాయమ ఉపాధ్యాయులు మస్తా నయ్య, హరిబాబు ఆధ్వర్యంలో ఘనంగా స్పోర్ట్స్ డే నిర్వహిం చారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పండితుల జన్మదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రం వ్యాప్తంగా తెలుగు దినో త్సవం, జరుపుకోవడంతోపాటు తెలుగు గొప్పతనాన్ని అందరూ తెలుసుకోవాలని వారి కోరారు. మాతృభాష దినోత్సవ సంద ర్భంగా విద్యార్థులకు వ్యాస రచ న, పద్య పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్య





క్రమంలో పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ఆనందయ్య, హరిబాబు, ఉపాధ్యాయుల బృందం, వ్యాయామ ఉపాధ్యాయులు మస్తానయ్య, హరిబాబు, మ్యాజిక్ బస్సు ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కొణిదెల నాగబాబుకి కాణిపాకం స్వామి వారి ప్రసాదాలు అందజేసిన పూల ప్రభాకర్

కాణిపాకం,స్వర్ణ సాగరం ఆగస్టు 29 :



ఐరాల శుక్రవారం ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ గా పదవి బాధ్యతలు చేపట్టిన కొణిదల నాగబాబుని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి ప్రసాదాలను వస్త్రాలను అందజేసిన పూల ప్రభాకర్, ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్తను ప్రేమగా పలకరిస్తూ అభిమానంగా మాట్లాడతారని తెలియజేశారు.

swarna sagaram_Swarna sagaram.qxd 8/29/2026 11:07 PM Page 2



# బిరదవోలులో డ్రాగన్ ఫ్రూట్, పనస తోటల పరిశీలన.

స్వర్ణ సాగరంపొదలకూరు ఆగస్టు29



మండలంలోని బిరదవోలు గ్రామంలో ఉద్యాన శాఖ డైరెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు శనివారం పర్యటించారు. గ్రామానికి చెందిన రైతు ఎం. కొండారెడ్డి సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్, పనస తోటలతో పాటు ఫారం పాండ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో పంటల సాగు, దిగుబడులు, మార్కెటింగ్ అవకాశాలు, ప్రభుత్వ రాయితీలపై చర్చించారు.డ్రాగన్ ఫ్రూట్ సాగును ప్రోత్సహించేందుకు ఉద్యాన శాఖ ద్వారా మొదటి సంవత్సరం రూ.1.68 లక్షలు, రెండో సంవత్సరం రూ.1.02 లక్షల వరకు రాయితీ అందిస్తున్నట్లు డైరెక్టర్ తెలిపారు. అలాగే ప్రతి చదరపు మీటరుకు రూ.15 రాయితీతో వీడ్ మ్యాట్‌ను రైతులకు అందిస్తున్నామని చెప్పారు. వీడ్ మ్యాట్ వినియోగం వల్ల నేలలో తేమ ఎక్కువ కాలం నిలిచి, నీటి వినియోగ సామర్థ్యం పెరగడంతో పాటు కలుపు మొక్కల పెరుగుదలను నియంత్రించవచ్చని వివరించారు.రైతులు తమ పొలాల్లో నీటి వనరులను అభివృద్ధి చేసుకునేందుకు 20ఐ20ఐ3 మీటర్ల పరిమాణంలో వ్యక్తిగత ఫారం పాండ్‌ల నిర్మాణానికి రూ.90 వేల వరకు రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు.ఉద్యాన పంటలను ఎల్‌నినో ప్రభావం నుంచి రక్షించేందుకు ముందస్తు ఉపశమన చర్యలు చేపట్టాలని సూచించారు. పండ్ల తోటల మొదళ్లలో పిఎండిఎస్ విత్తనాలను వేయడం ద్వారా వర్షాలు ఆలస్యమైన సమయంలో మొక్కలు ఎండిపోకుండా కాపాడటంతో పాటు నేలలో సేంద్రియ కర్బనం పెరిగి భూసారం మెరుగుపడుతుందని తెలిపారు. డ్రిప్ పద్ధతిలో అవసరమైన మోతాదులోనే నీటిని మొక్కలకు అందించడం ద్వారా నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని, డ్రిప్ పరికరాల ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీలు అందిస్తున్నందున రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి ఎం.వి. సుబ్బారెడ్డి, ఉద్యాన అధికారి ఈ. ఆనంద్, ఆర్ఎస్‌కే సిబ్బంది మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# నాగార్జున పాఠశాలలో ఘనంగా తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలు

స్వర్ణ సాగరం పొదలకూరుఆగస్టు29



పట్టణంలోని నాగార్జున ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శనివారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో మాతృ భాషపై మమకారం, తెలుగు భాష గొప్పతనంపై అవగాహనతో పాటు క్రీడల పట్ల ఆసక్తి, క్రీడాస్ఫూర్తిని పెంపొందించే ఉద్దేశంతో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా తెలుగు భాష ప్రాముఖ్యత, తెలుగు సాహిత్య వైభవం, మాతృభాష పరిరక్షణ ఆవశ్యకతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. తెలుగు భాషను నిత్య జీవితంలో విస్తృతంగా వినియోగిస్తూ, భాషా పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలు, జట్టుగా పనిచేసే మనస్తత్వం పెంపొందుతాయని తెలిపారు.

**ఉపాధ్యాయులకు ఘన సన్మానం...**ఈ కార్యక్రమంలో పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు ,ప్రిన్సిపాల్ ఎన్. లక్ష్మీ దుర్గా, కావ్యలను ఘనంగా సన్మానించారు. తెలుగు భాషాభివృద్ధికి, విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు వారు చేస్తున్న కృషిని అభినందించారు. అలాగే పాఠశాల పీఈటీ ప్రదీప్‌ను కూడా సత్కరించి, విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు.

**పోటీల్లో విద్యార్థుల ప్రతిభ...**తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వం, పద్యాల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. బహుమతులు అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేయగా, తోటి విద్యార్థులు చప్పట్లతో అభినందించారు.తెలుగు భాషను ప్రేమించి, చదవడం--రాయడం అలవర్చుకోవడంతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను చాటాలని పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల సర్వతోముఖ వికాసానికి విద్యతో పాటు భాషా, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.వేడుకల సందర్భంగా పాఠశాల ఆవరణలో సందడి నెలకొంది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో కార్యక్రమం ఆహ్లాదకరంగా సాగింది. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పదో తరగతిలో 558 మార్కులు.. సంజనకు బలిజ సేవా ఫౌండేషన్ అండ



నాయుడుపేట,(స్వర్ణ-సాగరం)ఆగస్టు 29:

సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట పట్టణానికి చెందిన కళ్యాణం శ్రీనివాసులు కుమార్తె చిరంజీవి సంజన పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచింది. జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకున్న సంజన..యోగానంద ఇన్‌స్టిట్యూట్‌లో ట్యూషన్ తీసుకుంటూ 600 మార్కులకు 558 మార్కులు సాధించి ఉత్తీర్ణత సాధించింది. ఆమె ప్రతిభను అభినందిస్తూ గౌరవ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

**సంజన ఇంటర్ చదువుకు రూ.10 వేల ఆర్థిక సాయం...**విద్యను కొనసాగించేందుకు సంజనకు బలిజ సేవా ఫౌండేషన్ అండగా నిలిచింది. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫీజు నిమిత్తం బలిజ సేవా ఫౌండేషన్ కార్యనిర్వాహక సభ్యులు, నాయుడుపేట బలిజ సంఘం అధ్యక్షుడు పగడాల శివప్రదీప్, హంస పృథ్వీచందు కలిసి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని సంజన ఇంటి వద్ద అందజేశారు.

**విద్యార్థుల ప్రోత్సాహానికి బలిజ సేవా ఫౌండేషన్...**ఈ సందర్భంగా విద్యార్థులు విద్యలో రాణించేందుకు అవసరమైన సహకారం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాటిపర్తి ముకుంద కలి చరణ్ (ప్రభుత్వ పశు వైద్యశాఖ), తాటిపర్తి ఉమామహేశ్వరి (యోగానంద ఇన్‌స్టిట్యూట్ కరస్పాండెంట్), వక్కలక్కుల సునీతమ్మ, బారు హరి తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు భాషా ఔనత్యాన్ని చాటుదాం

## ఆకట్టుకున్న తెలుగు తల్లి వేషధారణ

స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ

దేశభాషలందు తెలుగు లెస్సగా కీర్తింపబడిన మన తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటుదామని వేల సంవత్సరాల చరిత్ర కలిగిన మన తెలుగు భాషా సంపదను భావితరాలకు అందించాల్సిన బాధ్యత తెలుగువారిగా మనందరి బాధ్యతని మండల విద్యాశాఖ అధికారి ముని సుబ్రమణ్యం తెలియజేశారు.మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో శనివారం గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళి నిర్వహణలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు మన మాతృభాష అని నేడు తీయ్యనైనా తెలుగు పలుకులైన అమ్మానాన్నలను మమ్మీ డాడీలు చేస్తున్నారని అలా కాకుండా





తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పాలన్నారు. తెలుగు తల్లి వేషధారణ వేసిన 9వ తరగతి విద్యార్థిని రిషిక చూపరులను ఆకట్టుకుంది.అనంతరం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పద్యపఠనం, వ్యాసరచన, బాల గేయాలు, చిత్రలేఖనం, క్విజ్ పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు విజ్ఞానాన్ని పంచే విలువైన పుస్తకాలు బహుమతులుగా అందించారు.అనంతరం మన సంస్కృతి కళా సంస్థ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కలకట రెడ్డప్ప విశిష్టఅతిథిగా పాల్గొని జానపద కళారూపాలు, సాహిత్యంపై గీతాలతో ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మయ్య, జగన్నాథం, సుజన, దాసు, రమేష్, హరిత తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి పాఠశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

## తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి సేవలు చిరస్మరణీయం

## విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు.. ఆకట్టుకున్న పోటీలు

స్వర్ణ సాగరంపొదలకూరుఆగస్టు29

తెలుగు భాషా పరిరక్షణ, అభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని అమరావతి పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాతృభాష గొప్పతనం, తెలుగు భాష ఔన్నత్యం, దాని ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేసే ఉద్దేశంతో పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె. సురేష్ గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. తెలుగు భాషను ప్రజలకు చేరువ చేయడంలో, ముఖ్యంగా గ్రాంథిక భాష స్థానంలో వ్యవహారిక భాషకు ప్రాధాన్యత కల్పించేందుకు గిడుగు రామ్మూర్తి చేసిన కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. తెలుగు భాషను కేవలం పాఠ్యాంశంగా కాకుండా నిత్య జీవితంలో వినియోగించడం ద్వారా భావితరాలకు భాషా సంపదను అందించాల్సిన



బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.తెలుగు భాషాభివృద్ధిలో గిడుగు రామ్మూర్తి పోషించిన పాత్రను విద్యార్థులకు వివరించారు. సరళమైన వ్యవహారిక భాషలో విద్యాబోధన జరగాలనే ఆయన ఆలోచనలు నేటికీ ఆదర్శప్రాయమని తెలిపారు. మాతృభాషపై విద్యార్థుల్లో ఆసక్తి, అభిమానం పెంపొందించేలా పాఠశాల స్థాయిలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.అదేవిధంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో క్రీడా కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే తత్వాన్ని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా తెలిపారు. వివిధ క్రీడల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.కార్యక్రమంలో భాగంగా తెలుగు ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుడిని సన్మానించారు. విద్యార్థులకు పద్యపఠనం, వక్తృత్వం తదితర పోటీలు నిర్వహించారు. విద్యార్థులు తెలుగు భాష గొప్పతనాన్ని ప్రతిబింబించేలా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలుగు పద్యాలు, ప్రసంగాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు.అనంతరం మాతృభాషను గౌరవిస్తూ, తెలుగు భాషకు దైనందిన జీవితంలో సముచిత స్థానం కల్పిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. తెలుగు భాషపై విద్యార్థుల్లో మరింత అవగాహన, ఆసక్తి పెంపొందించేలా పాఠశాలలో భవిష్యత్తులోనూ పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం దందాలో 'చిన్న చేపల' వేటతోనే సరిపెడతారా?

## వాహనం పట్టుబడింది.. కేసు నమోదైంది.. మరి బియ్యం వెనుక ఉన్న అసలు బాస్ ఎవరు?

## నాయుడుపేటలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఆరోపణలు.. మూలాలపై దర్యాప్తు ఎప్పుడంటున్న ప్రజలు

నాయుడుపేట (స్వర్ణ--సాగరం), ఆగస్టు 29:

పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యంపై అక్రమ వ్యాపారుల కన్ను పడిందన్న ఆరోపణలు నాయుడుపేటలో కలకలం రేపుతున్నాయి. అక్కడక్కడా వాహనాలు పట్టుబడుతున్నా.. కేసులు నమోదవుతున్నా.. ఈ అక్రమ రవాణా పూర్తిగా ఆగకపోవడం వెనుక అసలు కారణమేంటి? అన్న ప్రశ్న ఇప్పుడు ప్రజల్లో మరింత బలంగా వినిపిస్తోంది.

ఒక వాహనం పట్టుబడితే.. అందులో ఉన్న బియ్యం స్వాధీనం చేసుకుంటారు. సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తారు. కానీ ఆ బియ్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు సేకరించారు? ఎవరి కోసం సేకరించారు? ఎక్కడికి వెళ్లాలి? అనే ప్రశ్నల దర్యాప్తు ఎంతవరకు సాగుతోందన్నదే అసలు అంశంగా మారింది.

**పట్టుబడేది చివరి లింకేనా?...**రేషన్ బియ్యం అక్రమ రవాణా వెనుక ఒక గొలుసు ఉంటే.. రోడ్డుపై పట్టుబడే వ్యక్తి అందులో చివరి లింక్ మాత్రమే అయ్యే అవకాశం ఉంది. గ్రామాల్లో బియ్యం సేకరించే వ్యక్తులు.. సేకరించిన బియ్యాన్ని ఒకచోటకు చేర్చేవారు.. నిల్వ చేసేవారు.. వాహనాల్లో తరలించేవారు.. చివరకు కొనుగోలు చేసేవారు..

ఈ గొలుసులో ఒక్కొక్కరిని గుర్తించకుండా.. కేవలం



వాహనాన్ని పట్టుకోవడంతో దందాకు శాశ్వతంగా అడ్డుకట్ట పడుతుందా? అనే ప్రశ్న తలెత్తుతోంది.

**బియ్యం ఎక్కడ పోగవుతోంది?...**పెద్ద మొత్తంలో రేషన్ బియ్యం తరలిపోతోందన్న ఆరోపణలు నిజమైతే.. దాని వెనుక నిల్వ కేంద్రాలు ఎక్కడున్నాయన్న అంశం కీలకంగా మారుతోంది.అనుమానాస్పద గోదాములు, ఇళ్లలో నిల్వలు, రాత్రివేళల్లో జరిగే రవాణా, తరచూ మారే వాహన మార్గాలు.. ఇలా ప్రతి అంశంపైనా నిఘా పెంచితేనే అక్రమ రవాణా మూలాలను గుర్తించే అవకాశం ఉంటుందని ప్రజలు అంటున్నారు.

**'కలెక్షన్' నుంచి 'కన్సైన్‌మెంట్' వరకు.. ఎవరి పాత్ర?...**రేషన్ బియ్యం దందా కేవలం రవాణా చేసే వ్యక్తులతోనే నడవదనే వాదనలు వినిపిస్తున్నాయి. బియ్యం సేకరించేవారు ఎవరు? డబ్బులు చెల్లించేవారు ఎవరు? వాహనాలను ఏర్పాటు చేసేది ఎవరు? నిల్వ చేసేది ఎవరు? చివరకు కొనుగోలు చేసేది ఎవరు?ఈ ప్రశ్నలకు సమాధానాలు బయటపడితేనే అసలు దందా పరిమాణం అర్థమవుతుంది.అందుకే అధికారులు రేషన్ బియ్యం అక్రమ రవాణాను కేవలం 'వాహనాల తనిఖీ' అంశంగా కాకుండా.. అవసరమైతే పూర్తి నెట్‌వర్క్‌పై దర్యాప్తు చేయాల్సిన వ్యవహారంగా చూడాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

**పేదల బియ్యంపై లాభాలు ఎవరి జేబుల్లోకి?,,,**ప్రభుత్వం సబ్సిడీపై పేదలకు అందించే బియ్యం పక్కదారి పడుతుందన్న ఆరోపణలు నిజమైతే.. ఆ బియ్యం ద్వారా వచ్చే అక్రమ లాభాలు ఎవరి చేతుల్లోకి వెళు_తున్నాయన్నదీ పరిశీలించాల్సిన అంశమే.

బియ్యం కొనుగోలు, రవాణా, నిల్వ, విక్రయాల్లో పెద్ద మొత్తంలో లావాదేవీలు జరుగుతున్నాయా? వాటి వెనుక ఎవరున్నారు? అనే అంశాలను అధికారులు ఆధారాలతో పరిశీలిస్తే.. దందా పరిమాణంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**రేషన్ బియ్యం దందాకు 'బ్రేక్' వేయాలంటే..**నాయుడుపేటలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో.. సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.రేషన్ దుకాణాల నుంచి బియ్యం లబ్ధిదారులకు చేరే వరకు సరఫరా వ్యవస్థను పరిశీలించడంతో పాటు.. అనుమానాస్పద సేకరణ, నిల్వ, రవాణా మార్గాలపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.వాహనం పట్టుకోవడం విజయమే.. కానీ ఆ వాహనాన్ని పంపిన వ్యక్తి వరకు చేరుకోవడమే అసలు విజయం.

**నిన్నటి ప్రశ్నకు.. ఈరోజు మరో ప్రశ్న!...**పేదల బియ్యం పక్కదారి పడుతోందన్న ఆరోపణలు నిజమా? నిజమైతే ఈ దందా వెనుక ఉన్న వ్యవస్థ ఎంత పెద్దది? దాని మూలాలు ఎక్కడున్నాయి? ఎవరి అండతో సాగుతోంది?నాయుడుపేట ప్రజలు ఇప్పుడు అధికారుల నుంచి కోరేది ఒక్కటే..

**"చివరి లింక్‌ను కాదు.. మొత్తం లింక్‌ను బయటకు తీయండి."..**పేదల కడుపు నింపాల్సిన బియ్యం.. అక్రమ వ్యాపారుల గోదాములకు చేరకుండా చర్యలు తీసుకోవాలి. రేషన్ బియ్యం దందాకు నిజమైన అడ్డుకట్ట ఎప్పుడు పడుతుందో.. ఇక అధికారుల దర్యాప్తే తేల్చాలి!

# క్యూఆర్ కోడ్ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ షబీర్ బాషకు వినతిపత్రం అందించిన రేషన్ డీలర్లు

బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.ఆగస్టు 29

క్యూఆర్ కోడ్ సమస్యను పరిష్కరించాలని బంగారుపాళ్యం మండల పరిధిలోని రేషన్ డీలర్లు శనివారం తహసీల్దార్ షబీర్ బాషకు వినతి పత్రం అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ బస్తాలపైనా క్యూఆర్ కోడ్ స్కానింగ్ వల్ల రేషన్ డీలర్లకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని రేషన్ డీలర్లు అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని



తహసీల్దార్ షబీర్ బాషను కోరారు.ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి,సంఘ నాయకులు నరేష్,ప్రసాద్, రాధకృష్ణ,రఘు,మరియు మండలంలోని పలువురు డీలర్లు పాల్గొన్నారు

swarna sagaram_Swarna sagaram.qxd 8/29/2026 11:07 PM Page 3



# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం మరియు తెలుగు భాష దినోత్సవం

ఇందుకూరుపేట స్వర్ణ సాగరం ఆగస్టు 29

మండలం లోని నరసాపురం ఎం వి.ఆర్.ఆర్ ఉన్నత పాఠశాల లో శనివారం జాతీయ క్రీడా దినోత్సవం మరియు తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరిగింది పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు క్రీడ పోటీలు నిర్వహించి బహుమతులు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ముజీర్ మరియు తెలుగు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులకు పద్య పఠనం వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వడం జరిగింది చివరిగా విద్యార్థిని విద్యార్థులకు తెలుగు ఉపాధ్యాయులు కృష్ణా రెడ్డి, కామేశ్వరి మరియు వ్యాయామ ఉపాధ్యాయులు ముజీర్ కలిసి పాఠశాల విద్యార్థులందరికీ స్వీట్స్ పంచడం జరిగింది



కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరావు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియు బోధనేతర సిబ్బంది అందరూ పాల్గొని విద్యార్థులకు తెలుగు భాష దినోత్సవం శుభాకాంక్షలు మరియు జాతీయ క్రీడ దినోత్సవ ప్రతిష్టతను



తెలియజేసి వారిని స్మరించి గిడుగు రామమూర్తి పటానికి మరియు మేజర్ ధ్యాన్ చంద్ పటానికి గులాబి పూల మాలలతో నివాళులు సమర్పించినారు

# కామ్రేడ్ షేక్ అబ్దుల్ బషీర్ సేవలు చిరస్మరణీయం







కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 29

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక హక్కుల సాధనకు కామ్రేడ్ షేక్ అబ్దుల్ బషీర్ చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. శనివారం కనిగిరిలో ఎన్జీవో అసోసియేషన్, బషీర్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆయన 6వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బషీర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి రమణారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి బషీర్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. జిల్లా యుటీఎఫ్ మాజీ అధ్యక్షుడు మీగడ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ యూనియన్లకు అతీతంగా ఉద్యోగ, కార్మికుల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేసిన నాయకుడని కొనియాడారు.వికలాంగుల హక్కుల అధ్యక్షుడు ధూళిపాళ్ల మల్లికార్జునరావు మాట్లాడుతూ బషీర్ పేరుతో కనిగిరి మున్సిపాలిటీలో కాలనీకి నామకరణం చేయాలని, తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేసి, గార్లపేట రోడ్డులోని వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో, ప్రజా సంఘాల నాయకులు రాంప్రసాద్, హజరత్ ఆలీ, భాస్కర్, జక్రయ్య, తమ్మినేని వెంకటరెడ్డి, చిలకల శివరామిరెడ్డి, చెన్నయ్య, నాగభూషణం, కరీముల్లా, సయ్యద్ నాయబ్ రసూల్, మంద్రు రమేష్ బాబు, మిరంపల్లి హరిబాబు, కుటుంబ సభ్యులు జలీల్, హబీబ్, సుమైర్, సుహైల్, షేక్ ఖాజా హుస్సేన్, షాహిద్, సమద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.వి. గ్రూప్ విద్యా సంస్థల్లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు..

కోవూరు, స్వర్ణ సాగరం , ఆగస్టు 29:



ఎస్.వి. గ్రూప్ విద్యా సంస్థల ఆవరణలో ఎన్ఎస్ఎస్ యూనిట్, ఎన్సిసి క్యాడెట్లు మరియు క్రీడా విభాగం ఆధ్వర్యంలో ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, ఆరోగ్యంపై అవగాహన మరియు జట్టు భావనను పెంపొందించేలా కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలను కూడా తమ జీవితంలో భాగంగా చేసుకుని శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఎదగాలని అన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పి. గుణశేఖర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో కూడా చురుకుగా పాల్గొనాలని, క్రీడలు ఆరోగ్యకరమైన జీవనశైలికి ఎంతో దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. జయలక్ష్మి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవీలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి. రవికుమార్, విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, ఎన్సిసి క్యాడెట్లు మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## టిడిపి నాయకుల చెర నుండి గుంట పోరంబోకు భూములను కాపాడాలని వినతి



పెళ్లకూరు స్వర్ణసాగరం ఆగస్టు 29.

మండలంలోని పానబాక గ్రామం సర్వేనెంబర్ 106-10లో ఉన్న గుంట పోరంబోకు భూమిని స్థానిక టిడిపి నాయకుల చెర నుండి కాపాడాలని శనివారం పలువురు గ్రామస్తులు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ యువరాజును కలిసి వినతి పత్రం అందించారు. 2018లో గుంట పోరంబోకు భూమిని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆక్రమించే ప్రయత్నం చేయగా అప్పటి రెవెన్యూ అధికారులు సంబంధిత స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి భూములను కాపాడుకునే విషయం గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం అధికారాన్ని అడ్డం పెట్టుకుని టిడిపి నాయకులు గుంట పోరంబోకు భూములను మరోసారి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని రెవెన్యూ అధికారులు స్పందించి సంబంధిత భూములను కాపాడాలని వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నీలం కృష్ణయ్య, మల్లయ్య, అట్ట కృష్ణయ్య, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని విద్యార్థి దుర్మరణం మరో ఇద్దరు పరిస్థితి విషమం

పెళ్లకూరు స్వర్ణసాగరం ఆగస్టు 29.



నాయుడుపేట పూతలపట్టు జాతీయ రహదారి మార్గంలో పెన్నేపల్లి గ్రామ సమీపన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి మృతి చెందాడు. మరో ఇద్దరు విద్యార్థులు తీవ్ర గాయాలతో పరిస్థితి విషమంగా మారింది. స్థానికుల సమాచారం మేరకు వివరాలు. నాయుడుపేట శ్రీ వేమ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఆదిత్య, మన్వేష్, బ్రహ్మయ్య అనే ముగ్గురు విద్యార్థులు శనివారం ఉదయం శారీరక వ్యాయామంలో భాగంగా నాయుడుపేట నుంచి వాకింగ్ చేసుకుంటూ పెన్నేపల్లి గ్రామ సమీపన జాతీయ రహదారి డివైడర్ పై సేదతీరుతుండగా... అదే సమయంలో నాయుడుపేట నుండి తిరుపతి వైపు వెళుతున్న గుర్తుతెలియని వాహనం విద్యార్థుల మీదికి దూసుకు వెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముగ్గురు విద్యార్థులను స్థానికులు హుటాహుటిన చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదిత్య మృతి చెందగా మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఆదిలక్ష్మి తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈమెరకు కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

## వివాహిత మహిళ ఆత్మహత్యపై కేసు నమోదు చేసిన అర్బన్ పోలీసులు

రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్టు 29



రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నాస్వామిపల్లి గ్రామానికి చెందిన వరకుమారి (35) అనే వివాహిత మహిళ శనివారం అనగా 29-08-2026 న ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం అందింది.ప్రాథమిక సమాచారం మేరకు, మృతురాలు చాణుక్యను సుమారు 11 సంవత్సరాల క్రితం వివాహం చేసుకోగా, వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 28-08-2026 న తన పిల్లల ఆరోగ్యం సరిగా లేదని 29-08-2026 న ఉదయం సుమారు 10:00 గంటల సమయంలో, మృతురాలి భర్త తన కుమార్తెను ఆసుపత్రికి తీసుకెళ్లిన అనంతరం, ఇంటి మొదటి అంతస్తులోని రేకుల షెడ్డు వద్ద మృతురాలు చీరతో ఉరి వేసుకుని వేలాడుతున్న స్థితిలో గమనించి వెంటనే ఆమెను కిందకు దించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతురాలి తల్లి డి. మునిమ్మ, వయస్సు 60 సంవత్సరాలు, ఇచ్చిన ఫిర్యాదు మేరకు రేణిగుంట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి , పోస్టుమార్టంనిమిత్తం పంపబడింది. ఈ ఘటనకు సంబంధించి ఎటువంటి ఊహాగానాలు లేదా నిర్ధారణకు రాని సమాచారాన్ని ప్రచారం చేయవద్దని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేసారు.

## ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

### గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు

స్వర్ణ సాగరం నాగలాపురం ఆగస్టు 29:

గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని నాగలాపురం పడమట హరిజనవాడలోని ఎంపియుపి పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు.ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు అవసరం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యా యురాలు శ్రీలత గిడుగు వెంకట రామమూర్తి పంతులు గారు తెలుగు భాష అభివృద్ధికి చేసిన విశేష సేవలను విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా వ్యవహారిక భాషను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆయన చేసిన కృషి,తెలుగు భాషా వికాసానికి ఆయన అందించిన సేవలను వివరించారు.అనంతరం విద్యార్థులు తెలుగు భాషకు సంబంధించిన జాతీయాలు, సామెతలు,పొడు పుకథలు తదితర అంశాలను చక్కగా ప్రదర్శించి,వాటి ప్రాముఖ్యతను వివరించారు.తెలుగు భాష గొప్పతనాన్ని తెలియజేసేలా



విద్యార్థులు నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నీరజ,శ్రీనివాస రాజు, జయశ్రీ,కల్పన తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు....

స్వర్ణసాగరం ఏర్పేడు :-



ఏర్పేడు మండలం మడిబాక గ్రామపంచాయతీ రాజులకండ్రిగ ఆదర్శ పాఠశాలలో శనివారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బాల సరస్వతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బాల సరస్వతితో పాటు రత్నకుమార్, అరుణ్‌కుమారి, సుభాషిణి తదితరులు గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం రత్నకుమార్ మాట్లాడుతూ మాతృభాష అయిన తెలుగును పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆంగ్ల భాషను నేర్చుకున్నప్పటికీ, మన సంస్కృతి, సంప్రదాయాలకు మూలమైన తెలుగు భాషను ఎట్టి పరిస్థితుల్లోనూ మరువకూడదని విద్యార్థులకు సూచించారు.అరుణ్‌కుమారి మాట్లాడుతూ పాఠశాలలో తెలుగు భాష అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుభాషిణి మాట్లాడుతూ తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన తెలుగు పద్యాల పఠనం, కోలాటం, సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయని అన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఉపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయుల వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

## రాజులపాలెం ST కాలనీలో టీడీపీ నాయకుల డోర్ టు డోర్ కార్యక్రమం...

స్వర్ణసాగరం ఏర్పేడు :-



ఏర్పేడు మండలం రాజులపాలెం ఎా కాలనీలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు పాల్గొని స్థానిక ప్రజలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ పార్టీ కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర, గాలి క్రిష్ణవేణి, చంద్రశేఖర్ నాయుడు, జగదీష్, రాచేటి సుబ్రమణ్యం, గుణా యాదవ్, మునిరెడ్డి, చంద్ర, వై. మనోహర్ నాయుడు తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దామిరెడ్డి వారి వివాహ మహోత్సవానికి చింతలచెరువుకు ఆహ్వానము.

కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 29



ఆంధ్రప్రదేశ్ మాజీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ (జజుజ) చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి వారి నివాసంలో మాజీ సర్పంచ్ దామిరెడ్డి సుబ్బారామి రామి రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి సెప్టెంబర్ 6 వ తేది కనిగిరి మండలం కొత్తపాలెం గ్రామంలో జరుగు మాజీ సర్పంచ్ దామిరెడ్డి సుబ్బరామిరెడ్డి - ఆదిలక్ష్మి గార్ల కుమార్తె వివాహ మహోత్సవంలో పాల్గొనాలని కోరుతూ ఆహ్వాన పత్రిక అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ పెరుగు మురళి తదితరులు పాల్గొన్నారు.

## పాపసాని కుటుంబానికి వివాహ శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 29



కనిగిరి పట్టణంలోని చింతల పాలెంలో పాపసాని చంద్రమౌ లేశ్వరరెడ్డి-మాలతి గార్ల ఇంట్లో జరగనున్న వారి ఏకైక పుత్రిక లక్ష్మీ శ్రావణి వివాహ మహోత్సవ కార్యక్రమానికి కనిగిరి మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్సిపి కందుకూరు ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా వివాహ శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. కార్యక్రమంలో సానికొమ్ము రంగనాయకుల రెడ్డి, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బంగారుపాళ్యం,పాలేరులో జరిగే శ్రీ కృష్ణ జన్మాష్టమి ఊరేగింపు వేడుకలకు ఎమ్మెల్యే కు ఆహ్వానం



బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.ఆగస్టు 29

బంగారుపాళ్యం మండలం లోని పాలేరు గ్రామ పంచాయతీ లో జరిగే త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక బంగారుపాళ్యం కమిటీ" ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుక లు, ఊరేగింపు సెప్టెంబర్ నెల 9 వ తేది బంగారుపాళ్యం లో జరుగును.(అలాగే పాలేరు గ్రామంలో 4 వతేదీ ఊరేగింపు కు వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రికల ను పూతలపట్టు ఎమ్మెల్యే కే.మురళి మోహన్ కు చిత్తూరు లోని వారి నివాస స్వగృహం లో అందజేసి ఊరేగింపు కు ఆహ్వానించడం జరిగింది అనంతరం వారి అనుచరులని రమ్మని ఆహ్వానించడం జరిగింది సంతోషంగా తప్పక వస్తామని అన్నారు

**వేదిక:-** బంగారుపాలెం రాజావీధి లో 4 వ తేదీ నుండి పూజలు చేసి 9 వ తేదీ మధ్యాహ్నం ఊరేగింపు ఉంటుంది.. అలాగే పాలేరు గ్రామంలో 4 వతేదీ ఊరేగింపు ఉంటుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక బంగారుపాళ్యం కమిటీ అధ్యక్షుడు, సభ్యులు ధనుంజయ, డి.బాలాజీ,మునిరత్నం, హర్షవర్ధన్,ఉదయ్, సరళదేవి,నాగమ్మ, శాంతమ్మ,రేణుకదేవి, డివిత,వాణిశ్రీ,తులసి, రెడ్డెమ్మ,చామండేశ్వరి,లత, మంజుల లు పాల్గొన్నారు

swarna sagaram_Swarna sagaram.qxd 8/29/2026 11:07 PM Page 4



# చంద్రబాబు కి రాఖీ కట్టిన మేఘూల దేవి

కొయ్యలగూడెం స్వర్ణ సాగరం







రాఖీ పౌర్ణమి సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు కి అమరావతి నందు వారి కార్యాలయం వద్ద రాఖీ కట్టి,రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి,ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు సంతోషించి మహిళలకు అన్ని విధాల కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలియజేశారు,మేఘలాదేవి మాట్లాడుతూ రాష్ట్ర అక్క చెల్లెమ్మల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడానికి సీఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారు అని తెలియజేశారు అదే విదంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ కష్టపడినా ప్రతి ఒకరికి తెలుగు దేశం పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందని ప్రతి ఒకరికి పదవులు ఇవ్వడం జరుగుతుంది అని తెలిపారని అన్నారు .

# సంప్రదాయపరంగా తెలుగు భాషా దినోత్సవాణ్ణి నిర్వహించిన రైన్బో స్కూల్

## తెలుగు పద్యాలు, నృత్యాలు, సృజనాత్మక ప్రదర్శనలు నిర్వహించిన విద్యార్థులు

రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్టు 29






తెలుగు భాషా దినోత్సవ వేడుకలను రైన్బో స్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. మాతృభాష తెలుగు గొప్పతనం, మాధుర్యం, విలువతో పాటు తెలుగు భాషకు మన సంస్కృతి, సంప్ర దాయాల్లో ఉన్న ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేసేలా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు భాషపై అవగాహన కల్పించేలా నాట కాలు, పాటలు, పద్యాలు, కవిత్వాలు, నృత్య ప్రదర్శనలు నిర్వహి ంచారు. తమ మాటలు, పాటలు, ప్రదర్శనల ద్వారా తెలుగు భాషను ప్రేమించడం, గౌరవించడం, పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని చక్కగా తెలియజేశారు. చిన్నారుల ప్రతిభ, ఉత్సాహభరితమైన ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ఆత్మవిశ్వాసం, సృజనాత్మకతను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. మాతృభాషపై విద్యార్థుల్లో మరింత గౌరవం, అభిమానం పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. ఈ కార్యక్రమానికి ప్రోత్సాహం అందించిన రైన్బో స్కూల్ చైర్మన్ అతావుల్లా ఖాన్, ప్రిన్సిపాల్ షహేర్ బానులకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు మన భాష మాత్రమే కాదు మన సంస్కృతి, మన సంప్రదాయం, మన గుర్తింపు. తెలుగును మాట్లాడుదాం ప్రేమిద్దాం భావితరాలకు అందిద్దాం అనే సందేశంతో వేడుకలు ముగిశాయి.

# ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



## తెలుగు భాష గొప్పతనంపై విద్యార్థుల ర్యాలీ

ముత్తుకూరు: స్వర్ణ సాగరం

తెలుగు భాషా దినోత్సవంతో పాటు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శనివారం ముత్తుకూరు మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులు ర్యాలీగా వెళ్లి తెలుగు భాష గొప్పతనం, భాషా పరిరక్షణపై నినాదాలు చేశారు.ఈ సందర్భంగా తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ సేవలు, గొప్పతనం గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. తెలుగు భాష అభివృద్ధికి గిడుగు వెంకట రామమూర్తి చేసిన కృషిని, భారత హాకీ రంగంలో ధ్యాన్‌చంద్ సాధించిన ఘనతను వివరించారు.కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చల్లా శ్రీనివాసులు రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు ఆరవ సుకుమార్, రాంబాబుతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అత్యధిక ఇనుప ఖనిజం దిగుమతి.. ఎకెపిఎల్ రికార్డు

## 195,128 మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజం దిగుమతి.. గత రికార్డు బద్దలు

ముత్తుకూరు: స్వర్ణ సాగరం




అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ (ఎకెపిఎల్) మరో కీలక మైలురాయిని అధిగమించింది. ఒకే నౌక ద్వారా అత్యధికంగా 195,128 మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజాన్ని దిగుమతి చేసుకుని కొత్త రికార్డు నెలకొల్పింది. ఆగస్టు 27న ఎంవి మినరల్ డ్యూచ్లాండ్ నౌకను సురక్షితంగా బెర్తింగ్ చేయడంతో పాటు సరుకు దిగుమతి ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసింది.గతంలో 2024 నవంబర్ 23న ఎంవి మినరల్ హెల్లాస్ నౌక ద్వారా 195,014 మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజం దిగుమతితో నమోదైన రికార్డును తాజా దిగుమతితో అధిగమించింది.

**భారీ నౌకలకు అనువైన బెర్తులు..**ఎంవి మినరల్ డ్యూచ్లాండ్ 17.70 మీటర్ల డ్రాఫ్ట్, 300 మీటర్ల పొడవుతో కూడిన భారీ కేప్‌సైజ్ నౌక. ఇలాంటి అల్ట్రా-లార్జ్ నౌకలకు దేశంలోని కొద్ది పోర్టులే బెర్తింగ్ సౌకర్యం కల్పించగలవు. ఎకెపిఎల్‌లో ప్రస్తుతం భారీ నౌకల నిర్వహణకు అనువుగా రూపొందించిన ఐదు బెర్తులు ఉన్నాయి. దేశంలోని ఏ పోర్టులోనైనా ఇంత పెద్ద నౌకల నిర్వహణకు అందుబాటులో ఉన్న బెర్తుల సంఖ్యలో ఇది అత్యధికమని పోర్టు వర్గాలు పేర్కొన్నాయి.

# సత్యవేడులో రైతు కూలీల మహాసభలకు సన్నాహాలు

## మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు

స్వర్ణ సాగరం నాగలాపురం ఆగస్టు 29:

సెప్టెంబర్ 6న సత్యవేడులో నిర్వహించనున్న రైతు కూలీల సంఘం జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని రైతు కూలీల సంఘం నాగలాపురం మండల కమిటీ పిలుపునిచ్చింది.ఈ సందర్భంగా నాగలాపురం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ కాలనీలో మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు.ఈ విషయాన్ని నాగలాపురం మండల కార్యదర్శి ఆర్.మురుగేషన్ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.ఈ సందర్భంగా మురుగేషన్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల విధానాల కారణంగా రోజువారీ రైతు కూలీలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.నిత్యావసర వస్తువుల ధరలు



విపరీతంగా పెరగడంతో రైతు కూలీలు జీవనం సాగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.రైతు కూలీల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వాలు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.రైతు కూలీల సంఘం ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు పాటూరి వెంకటరత్నం మాట్లాడుతూ రైతు కూలీల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న రైతు కూలీల సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు .సత్యవేడులో జరిగే జిల్లా ప్రథమ మహాసభల్లో రైతు కూలీల సమస్యలపై విస్తృతంగా చర్చించి, భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు.రైతు కూలీల సంఘం జిల్లా నాయకులు దేశాండి అరుణాచలం మాట్లాడుతూ రైతు కూలీలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న వంద రోజుల ఉపాధి పనుల పథకానికి పేరు మార్చి, రాష్ట్ర ప్రభుత్వాలపై అదనపు భారం మోపే విధంగా తీసుకొస్తున్న పథకాన్ని వె ంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొన సాగించాలని కోరారు.సత్యవేడులో జరిగే రైతు కూలీల సం ఘం జిల్లా ప్రథమ మహాసభలను విజయవంతం చేసేం దుకు ప్రజా సంఘాలు,రైతులు,రైతు కూలీలు, యువత ,గ్రామీణ ప్రజలు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రైతు కూలీల సంఘం నాయకులు దక్షిణా మూర్తి, సుబ్బమ్మ,జయ,ప్రమీల,చారుమతి, ప్రత్యూష ,మురుగేషన్,మన్మధన్, సాంబలక్ష్మి,కర్పగం,సుమతి, గోవిం దమ్మ,పొన్నురువి ,పుంగవనం, దైవానమ్మ,శ్రీవల్లి కార్యకర్తలు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వివేకానంద ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు ఘనంగా తెలుగు భాష. జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు

శాంతిపురం స్వర్ణ సాగరం న్యూస్ 29



శాంతిపురం మండలంలోని మా మీ వివేకానంద ఇంగ్లీష్ మీడియంహై స్కూల్ నందు కరెస్పాండెంట్ ఆశా శంకరప్ప ఆధ్వర్యంలో తెలుగు భాష దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు కరెస్పాండెంట్ ఆశా శంకరప్పమాట్లాడుతూ విద్యార్థుల్లో మాతృభాషపై మమకారం తెలుగు భాష గొప్పతనంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ తెలుగు భాష మూలకర్త తెలుగు భాష మహనీయుడు గిడుగు వెంకట రామ్మూర్తి అని ఆయనజయంతి సందర్భంగా ఆగస్టు 29న తెలుగు భాష క్రీడా దినోత్సవం గా జరుపుకుంటామని విద్యార్థులకు సూచించారు అదేవిధంగా మాతృభాష మమకారం పై తెలుగు భాష గొప్పతనంపై అవగాహనతో పాటు క్రీడల పట్ల ఆసక్తి క్రీడా స్ఫూర్తిని పెంపొందించే ఉద్దేశంతో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు తెలుగు భాష క్రీడా దినోత్సవం పై ఒక్కొక్కరిగా తెలుగు భాష గొప్పతనంపై గిడుగు వెంకట రామ్మూర్తి సేవలను ఆయన స్ఫూర్తిని వివరించారు ఈ కార్యక్రమంలో పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఆనంద్ కి కరస్పాండెంట్ఆశ శంకరప్ప మరియు ఉపాధ్యాయ బృందం చే ఘనంగా సన్మానించారు తెలుగు భాషాభివృద్ధికి విద్యార్థుల్లో భాష నైపుణ్యాలను పెంపొందించేందుకు వారు చేస్తున్న కృషిని అభినందించారు అదేవిధంగా పి ఈ టి మురళి ని కూడా సత్కరించి విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఆశా శంకరప్ప ఎక్స్ హెచ్ ఎం అమ్మో మాలతి హెచ్ఎం సుబ్రహ్మణ్యం తోట ఉపాధ్యాయుల బృందం విద్యార్థులు పాల్గొన్నారు

# చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యం,



స్వర్ణసాగరం -శ్రీకాళహస్తి,

విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్.వి.ఏ. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ అన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని శనివారం కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా డాక్టర్ వాణిశ్రీ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతోపాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లోనూ ప్రతిభ చూపించాలని సూచించారు.150 కోట్లకు పైగా జనాభా ఉన్న భారతదేశం ఒలింపిక్స్‌లో ఆశించిన స్థాయిలో పతకాలు సాధించకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. పాఠశాల, కళాశాల స్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహించి ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మన్యం నరసింహులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి డాక్టర్ భాస్కర్, అధ్యాపకులు డాక్టర్ కె. సుబ్బారావు, డాక్టర్ బాపనయ్య, డాక్టర్ పి. గాయత్రి, డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ సామ్సన్‌రాజు, డాక్టర్ పి. వేణుగోపాల్, టి. నరసింహులు, డాక్టర్ వి. వాసవి, డాక్టర్ రవి ప్రసాద్, డాక్టర్ చంద్రమౌళి తదితరులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలపై సమీక్ష

కాణిపాకం, స్వర్ణసాగరం డిసెంబర్ 29 :




కాణిపాకం బ్రహ్మోత్సవాల బందోబస్తు ఏర్పాట్లపై ఎస్ డి పి ఓ , చిత్తూరు సమీక్ష శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు లో భాగంగా 14-09-2026 నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో, చిత్తూరు ఎస్ డి పి ఓ శనివారం కాణిపాకం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు.బ్రహ్మోత్సవాల సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణకు రూపొందించాల్సిన బందోబస్తు డ్రాఫ్ట్ స్కీం తయారీపై షో , కాణిపాకం మరియు సిబ్బందికి తగిన సూచనలు, దిశా నిర్దేశం చేశారు.భక్తుల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, సీసీటీవీ నిఘా, మరియు నేర నివారణ చర్యలపై ముందస్తు ప్రణాళికతో పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు కాణిపాకం ఎస్ఐ నరసింహులు స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి సుస్థిర ప్రణాళిక

స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ



మండలంలోని వెలుగు కార్యాలయం లో ఏటీఎం మునీయ ఆధ్వర్యంలో శనివారం గ్రామ సమాఖ్య లీడర్లుకు వి.పి.ఆర్.పి పై శిక్షణా కార్యక్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ సమాఖ్య లో సంఘ స్థాయిలో సభ్యురాలు వారీగా వారికి అంద వలసిన కనీస హక్కులు మరియు జీవనోపాధులు నమోదు చేసి ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామ సమాఖ్య స్థాయిలో ఈ రెండు ప్రణాళికలు ఏకీకరణ తో పాటు ప్రభుత్వ వస్తువులు, సేవలు మరియు వనరులు అభివృద్ధి తో పాటు సామాజిక అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసి ఏకీకరణ చేసి వీటిని పంచాయతీ పరిధిలోని అని గ్రామ సమాఖ్య ల ప్రణాళికలు ఏకీకరణ చేసి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.అక్టోబర్ లో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పై జరిగే గ్రామ సభలో సబ్మిట్ చేసి గ్రామ సభ ఆమోదం పొందిన తరువాత వాటి అమలు సంబందిత శాఖలు తో సమన్వయం చేసుకొని సాదించుకోవడం ద్వారా గ్రామం సుస్థిర అభివృద్ధి జరుగుతుంది అని ఆ దిశగా ప్రతి ఒక్కరూ పని చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిసి లు పయని, వెంకటరత్నం, జీవ, ట్రైనర్స్ విష్ణు ప్రియ, రేణుక, అకౌంటెంట్ లు హిమగిరిజ, శిరీష మరియు గ్రామ సమాఖ్య లీడర్ల తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మదన్ మోహన్ నాయుడు మృతి,

స్వర్ణసాగరం -తొట్టంబేడు,



తొట్టంబేడు మండలం పొయ్యి కొత్తూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మదన్ మోహన్ నాయుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి గాలి చలపతి నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గాలి మురళి నాయుడు పేర్కొన్నారు.పని నిమిత్తం మోటార్ వాహనంపై తిరుపతికి వెళ్తున్న మదన్ మోహన్ నాయుడు మార్గమధ్యంలో అంబులెన్స్‌ను దాటే క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. తీవ్రంగా గాయపడిన ఆయనను వెంటనే తిరుపతిలోని బాలాజీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఒకరోజు చికిత్స పొందిన అనంతరం పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. అనంతరం ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన పొయ్యి కొత్తూరుకు తీసుకువచ్చారు.సమాచారం తెలుసుకున్న గాలి చలపతి నాయుడు, గాలి మురళి నాయుడు గ్రామానికి చేరుకుని మదన్ మోహన్ నాయుడు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదన్ మోహన్ నాయుడు కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ పరిస్థితిని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# కింగ్ 100 గ్లింప్స్ విడుదల.. పవర్ ఫుల్ డైలాగ్‌తో హీరో పరిచయం




అక్కినేని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నాగార్జున కెరీర్‌లోని ప్రతిష్టాత్మక 100వ సినిమా సందడి మొదలైంది. 'కింగ్ 100'గా ప్రచారంలో ఉన్న ఈ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన టైటిల్‌ని గ్లింప్స్ ద్వారా రివీల్ చేశారు. సినిమా టైటిల్‌ని 'కింగ్ 100' అని పెట్టడం గమనార్హం. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై అక్కినేని ఫ్యామిలీ నిర్మాణంలో తమిళ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. నేడు నాగార్జున పుట్టిన రోజు కావడంతో ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ ని రిలీజ్ చేసారు. మనుషుల్లో రెండు రకాలు.. ఒకటి డబ్బున్న వాళ్లు, మరొకటి డబ్బు లేని వాళ్లు అనే పవర్ ఫుల్ డైలాగ్‌తో నాగార్జునని పరిచయం చేశారు. గ్లింప్స్ చూస్తుంటే డబ్బు లేని ఓ పేదవాడు కసిగా ఎదిగి, మోసాలు చేస్తూ బాగా సంపాదించి కింగ్ స్థాయికి ఎలా ఎదిగాడు అనేది చిత్రంలో చాలా ఇంట్రెస్టింగ్‌గా చూపించనున్నట్టు అర్థమవుతుంది. మరోవైపు చిత్రంలో ఫాదర్ ఎమోషన్ కూడా ఉండబోతుంది అని, నాగార్జున ఇందులో ఫ్లాష్ బ్యాక్ లో యంగ్ వర్షన్ లో కూడా కనిపించబోతున్నట్టు అర్థమవుతుంది. చిన్న గ్లింప్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తిని రేపుతోంది. కేవలం కొద్ది సెకన్ల వీడియోతోనే చిత్రంపై భారీ హైప్‌ను క్రియేట్ చేయడంలో మేకర్స్ సక్సెస్ అయ్యారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్న అంశం టబు ఎంట్రీ. గతంలో నాగార్జున, టబు కలిసి నటించిన 'నిన్నే పెళ్లాడుతా', 'ఆవిడా మా ఆవిడే' వంటి సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ హిట్ జోడీ మళ్లీ ఒకే సినిమాలో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో టబు పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, కథను మలుపు తిప్పే పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో ఆమె కనిపించనున్నారని సమాచారం. దీంతో నాగ్–టబు కాంబినేషన్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. 'నితమ్ ఒరు వానమ్' చిత్రంతో దర్శకుడిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న రా కార్తీక్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. భావోద్వేగాలకు, కమర్షియల్ ఎలిమెంట్స్‌కు సమాన ప్రాధాన్యం ఇస్తూ నాగార్జున 100వ సినిమాను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. గ్లింప్స్‌ను బట్టి చూస్తే, దర్శకుడు ఈసారి ఫీల్‌గుడ్ కథకు భిన్నంగా మిస్టరీ, యాక్షన్ అంశాలతో కూడిన కథను ఎంచుకున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీని డిసెంబర్ 24న విడుదల చేయనున్నట్టు గ్లింప్స్ తో తెలియజేశారు.



# ఓటీటీలోకి మలయాళ క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్.. ఇదేం ట్విస్టులు సామి!



ప్రేక్షకులందు సినిమా ప్రేక్షకులు వేరయా...అది ఆటైనా, పాటైనా ...వేడుకేదైనా, వేదికేదైనా ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా కార్యక్రమం రూపుదిద్దుకుంటే మాత్రం చాలు ఆ కార్యక్రమం విజయవంతమైనట్లే. కాని సినిమా ప్రేక్షకులు మాత్రం వీటన్నిటికీ విభిన్నం. విషయాన్ని సూటిగా చెబితే సినీ ప్రేక్షకులు అలరించరు. అదే విషయానికి కాస్త మసాలా దట్టించి చెప్పాలనుకున్న విషయాన్ని వినూత్నంగా చివరాఖరిలో చెబితేనే సినిమా అలరిస్తుంది. మరీ ముఖ్యంగా ఇప్పటితరం వైవిధ్యానికి పెద్ద పీట వేస్తోంది.ఆ నేపథ్యంలో వచ్చిన సినిమా ఉయిర్. ప్రముఖ ఓటీటీ సంస్థ జియోహాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఇదో క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్. ఇది మళయాళ సినిమా అయినా హాట్ స్టార్ లో తెలుగులోనూ లభ్యమవుతోంది. ప్రముఖ మళయాళ రచయితలు షాజీ, నిఖిల్ రాసిన కథకు పద్మకుమార్ ప్రాణం పోసిన సినిమానే ఉయిర్. ఈ సినిమా ప్రారంభం నుండి శు భం కార్డు వరకు ప్రేక్షకుడిలో ఆమితాసక్తిని రేకెత్తిస్తూ ఆఖరి సన్నివేశం వరకూ ఉత్కంఠ రేపుతుంది. అంతలా ఈ సినిమా కథలో ఏముందో ఓ సారి చూద్దాం. కేరళలోని కన్నూర్ సమీప ప్రాంతంలో ఉన్న ఓ పాడుబడిన బావిలో కుళ్ళిపోయిన స్థితిలో ఒక గుర్తుతెలియని మహిళ మృతదేహం బయటపడటంతో కథ ప్రారంభమవుతుంది. కొత్తగా విధుల్లో చేరిన సబ్‌ఇన్‌స్పెక్టర్ అజీబ్‌కు ఈ కేసు దర్యాప్తు బాధ్యత అప్పగిస్తారు. సీనియర్ పోలీస్ ఆఫీసర్ జాయ్ పర్యవేక్షణలో అజీబ్ తన మొదటి పెద్ద కేసుగా దీన్ని తీసుకుంటాడు. ప్రారంభంలో ఎలాంటి క్లూస్ దొరకకపోయినా, ఆ శవం వేసుకోనున్న బట్టలు, చేతి గాజుల ఆధారంగా ఆ మహిళ కర్ణాటక సరిహద్దు ప్రాంతం నుంచి వచ్చిన వలస కార్మికురాలు 'శోభ' అని గుర్తిస్తారు.విచారణ ముందుకెళ్ళేకొద్దీ ఇది సాధారణ హత్య కాదని దీని వెనుక పెద్ద మోసపూరిత కుట్ర దాగుందని అజీబ్ కు అర్థమవుతుంది. శోభ హత్య సమయంలో తప్పిపోయిన శోభ పిల్లల గురించి అజీబ్ ఆరా తీస్తుంటాడు. మరో వైపు అజీబ్‌కు చిన్నతనంలోనే తన సొంత చెల్లెలు తప్పిపోయిన చేదు జ్ఞాపకం నిరంతరం వెంటాడుతూ ఉంటుంది. దానికి ఈ హత్యకు ఓ లింకు కూడా ఉంటుంది. మరి శోభను హత్య చేసిన అసలు నేరస్థుడిని అలాగే శోభ పిల్లలను అజీబ్ వెతికి పట్టుకుంటాడా లేదా అన్నది మాత్రం ఉయిర్ సినిమాలోనే చూడాలి. ఈ సినిమా స్క్రీన్ ప్లే మాత్రం ఊహకందని రీతిలో పరిగెడుతుంది. మస్ట్ వాచ్ థ్రిల్లర్ ఫర్ ది వీకెండ్.

# ఆగని 'ఇరుముడి' జోరు.. ఇప్పటివరకు కలెక్షన్స్ ఎంతంటే?

చీకటి తర్వాత వెలుగు రావడం ఎంత సహజమో.. వరుస పరాజయాల తర్వాత ఓ విజయం పలకరించడం కూడా అంతే సహజమని మరోసారి నిరూపించాడు మాస్ మహారాజా రవితేజ. వరుస ఫ్లాపులతో సతమతమవుతున్న ఈ హీరోకు ఎట్టకేలకు 'ఇరుముడి'తో హిట్ దొరికింది. అది కూడా మాములు హిట్ కాదు.. బ్లాక్ బస్టర్.సినిమా రిలీజై వారం రోజులు గడిచినా ఇప్పటికే ప్రేక్షకులు ఈ సినిమా కోసం థియేటర్స్‌కి పోటెత్తున్నారు. దీంతో కలెక్షన్స్ కూడా భారీగా పెరిగిపోతున్నాయి. సినిమా రిలీజ్ అయిన నాలుగు రోజుల్లో ఏకంగా రూ. 100 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ రాబట్టింది. ఇక ఇప్పుడు రూ.150 కోట్ల క్లబ్‌లో చేరింది. ఇప్పటి వరకు ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా రూ. 150 కోట్లు వసూలు చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.

**అప్పుడెప్పుడో రూ. 100 కోట్లు..**

రవితేజ ఖాతాలో రూ. 100 కోట్ల వసూళ్ల సినిమా పడి చాలా కాలమైంది. 2022లో వచ్చిన ధమాకా ఒక్కటే సెంచరీ కొట్టింది. ఆ తర్వాత చేసిన సినిమాలన్నీ బాక్సాఫీస్ వద్ద దారుణంగా బోల్తా పడ్డాయి. ఈ నాలుగేళ్లలో ఆయన 6 సినిమాలు చేస్తే.. వాటిలో ఏ ఒక్కటి కూడా హిట్ టాక్‌ని సంపాదించుకోలేదు. కొన్ని సినిమాలు అయితే కనీసం రూ. 10 కోట్ల వసూళ్లను రాబట్టలేదు. చాలా కాలం తర్వాత ఇప్పుడు ఇరుముడితో హిట్ కొట్టి.. పాత లెక్కలన్నీ సరిచేశాడు. మరి ఇకపై ఈ మాస్ మహారాజ సినీ జర్నీ ఎలా ఉంటుందో చూడాలి.



# వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం'లో అదిరిపోయే సర్‌ప్రైజ్.. ఆ పాటని రీమిక్స్!

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. చాలా కాలం తర్వాత ఈ ఇద్దరూ కలిసి చేస్తున్న సినిమా కావడంతో వెంకీ అభిమానులతో పాటు సినీ ప్రేక్షకులు కూడా ఈ ప్రాజెక్ట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ముందుగా అనుకున్న సమయానికి విడుదల కావాల్సిన ఈ చిత్రం కొన్ని అనుకోని కారణాల వల్ల వాయిదా పడింది. ప్రస్తుతం మేకర్స్ సినిమాను అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే, తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వెంకటేష్ కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'కూలీ నెం.1' చిత్రంలోని సూపర్ హిట్ పాట 'దండాలయ్య ఉండ్రాలయ్య'ను 'ఆదర్శ కుటుంబం' కోసం కొత్తగా రీమిక్స్ చేస్తున్నట్లు సమాచారం. 'కూలీ నెం.1' సినిమాలో వెంకటేష్‌పై చిత్రీకరించిన 'దండాలయ్య ఉండ్రాలయ్య' పాట ఇప్పటికీ ప్రేక్షకుల మదిలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ముఖ్యంగా వినాయక చవితి సమయంలో గణేష్ మండపాల వద్ద ఈ పాట వినిపిస్తూనే ఉంటుంది. తరతరాలుగా ప్రేక్షకులను అలరిస్తున్న ఈ పాటకు ఇప్పటికీ ఉన్న క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ఇప్పుడు అదే చార్ట్‌బస్టర్ పాటను 'ఆదర్శ కుటుంబం' కోసం రీమిక్స్ చేయనున్నారనే వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. త్రివిక్రమ్ తనదైన శైలిలో ఈ పాటను ఎలా ప్రెజెంట్ చేస్తారు? అసలు కథలో ఈ పాటను ఏ సందర్భంలో ఉపయోగించబోతున్నారు? అనే అంశాలపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. పాత పాటలోని మ్యాజిక్‌ను అలాగే ఉంచుతూ, కొత్త తరం ప్రేక్షకులను ఆకట్టుకునేలా సరికొత్త మ్యూజిక్, గ్రాండ్ విజువల్స్‌తో ఈ రీమిక్స్‌ను రూపొందించే అవకాశం ఉందని టాక్. ముఖ్యంగా వెంకటేష్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో ఈ సాంగ్ వస్తే థియేటర్లలో మంచి సందడి నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన అందాల భామ శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. వెంకటేష్‌తో ఆమె కాంబినేషన్ ప్రేక్షకులకు కొత్తగా ఉండబోతోంది. ఇప్పటికే పలు చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శ్రీనిధి.. ఈ సినిమాలో కీలకమైన పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. వెంకటేష్ మార్క్ కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్‌కు శ్రీనిధి పాత్ర ఎలా తోడ్పడుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# కీర్తి సురేష్‌తో కలిసి నాని మాస్ స్టెప్పులు

## 'యెష నాగుల కట్ట మీద' లిరికల్ వీడియో సాంగ్ రిలీజ్



నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'ది ప్యారడైజ్' నుంచి మేకర్స్ మరో అదిరిపోయే మాస్ అప్‌డేట్ ఇచ్చారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి "యెష నాగుల కట్ట మీద.. యేసె ఉయ్యాల" సాంగ్‌ను విడుదల చేసిన చిత్రయూనిట్ తాజాగా లిరికల్ వీడియోను వదిలింది. పూర్తి లిరికల్ వీడియో సాంగ్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అచ్చమైన తెలంగాణ జానపద బాణీలో సాగే ఈ పాటలో కీర్తి సురేష్ స్పెషల్ అప్పీరెన్స్ ఇచ్చి నానితో కలిసి ఊరమాస్ స్టెప్పులతో అదరగొట్టారు. కాసర్ల శ్యామ్ అందించిన సాహిత్యం ఈ పాటకు మరింత ఊపునివ్వగా, జంగి రెడ్డి, ప్రభా తమ శక్తివంతమైన గొంతుతో పాడి ప్రాణం పోశారు. ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి రూ.200 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఈ సాంగ్ ద్వారా అంచనాలు మరింత తారాస్థాయికి చేరాయి. సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది.

Edited Printed Published & Owned by DAMA VIJAYA KUMAR. And Printed at VSR Printers, # 1-176, Vakadu Village and post, Vakadu Mandal, Tirupati District, Pin : 524415, A.P.
Published at VSR Publications, H.No. 403, Panta Street, Chittoor, Andhra pradesh, Pin : 517501, EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/26/A2367